# మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


## అర నిమిషంలో..

# అసైన్డ్ టు పట్టా..!

**- రెవెన్యు అధికారులకు లక్షలు దోచి(దాచి)పెట్టిన ధరణి**

**- ఎండోమెంట్, భూదాన్ భూములూ మాయం**

**- భూత్పూర్ తాసిల్దార్ కార్యాలయ అధికారుల నిర్వాకం ?**

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 12, ప్రభాతవార్త :** గత ప్రభుత్వం పాలన సాఫీగా సాగాలని, భూముల కొనుగోళ్లు, అమ్మకాలు, బదిలీ, మార్పులాంటి ఎన్నో రకాల సమస్యలకు చెక్ పెడుతూ తీసుకొచ్చిన ధరణి పోర్టల్ రెవెన్యూ అధికారులకు కల్పతరువులా మారింది. పోర్టల్‌లోని లూప్ హోల్స్ ఆధారంగా అసైన్డ్ భూములను పట్టాగా మార్చడం, నిషేధిత భూములు, భూదాన్ భూములను, ఎండోమెంట్ భూములను సైతం లోలోపలే మింగేసినట్లు తెలుస్తున్నది. రియల్టర్ల కోసం అసైన్డ్ భూములను దర్జాగా పట్టాగా మార్చడంతో కొందరు బాధితులు కలిసి తీగ లాడంతో అసలు నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. సర్వే నెంబర్ 369,370లోని ప్రైవేట్ పట్టా భూమిపై కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నది. కోర్టు ఆర్డర్ కూడా బేఖాతరు చేస్తూ ఓ రియల్ ఎస్టేట్ సంస్థ పేరుపై నాలా కన్వర్షన్ కింద చేశారు. ఈ తతంగం నడపడానికి తాసిల్దార్‌కు, సిబ్బందికి లక్షల్లో ముట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అమిస్తాపూర్ పరిధిలోని సిద్ధాయపల్లి రెండు పడకల గదుల సముదాయం వద్ద సర్వే నెంబర్ 208లో 11ఎకరాల అసైన్డ్ భూమి ఉన్నది. అయితే ఇందులో సుమారు 5ఎకరాల్లో ఇండ్ల నిర్మాణం చేపట్టి మిగతా భూమి లో 4ఎకరాలకు సంబంధించి పట్టాగా రిజిస్ట్రేషన్ చేశారు. బోడమోని చెరువు సమీపంలో వక్ఫ్ బోర్డు భూమి ఓ రియల్టర్ ప్లాటుగా మార్చినా కనీసం పట్టించుకోలేదని ఆరోపణలు ఉన్నాయి. శేరుపల్లి(బి)లో సర్వే నెంబర్ 215లో 10ఎకరాల భూదాన్ భూమి సర్వే నెంబర్ 220లో 9ఎకరాల అసైన్డ్ భూమిని సైతం ఓ వ్యాపారికి పట్టా చేశారు. గతంలో ప్రజాప్రతినిధులు గుర్తిం చి విచారణ చేయించి వెంచర్‌లో ఉన్న రాళ్లను తొలగించి తిరిగి ప్రభుత్వ భూమిగా బోర్డులు పెట్టారు. ఈభూములు నిషేధిత జాబితాలో ఉన్న అప్పటి తాసిల్దార్ పట్టించుకోకపోవడంతో యధావిధిగా రిజిస్ట్రేషన్ జరిపించారు. ఇదే శివారులోని 173, 174, 175,176,177లో 17ఎకరాల 10గుంటల భూమిని హనుమంతరావు తండ్రి రామచంద్రారావు 1956లో హైదరాబాద్‌లోని భూదాన్ బోర్డుకు దానపూర్వకంగా రాసి ఇచ్చారు. 1957లో భూత్పూర్ అమిస్తాపూర్‌కు చెందిని ఎస్సీ, బీసీ, ఓసి కులాలకు చెందిన 35ఎకరాల భూమని భూదాన్ బోర్డు పట్టాలను అందజేయగా ప్రస్తుతం ఈ భూమిలో కూడా రియల్ వ్యాపారులు కన్నేసి గోదాములు సైతం నిర్మించారు. ఇదే భూములపై గతంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మశ్రీ విచారణ చేసినా పట్టించుకోకుండా కలెక్టర్ వద్దకు విచారణ వెళ్లకుండా అప్పటి తాసిల్దార్ రియల్ వ్యాపారులు కలిసి నిషేధిత జాబితా నుంచి తొలగించడం గమనార్హం. ఇలా ఇటు సీసీఎల్ఏ, అటు కలెక్టరేట్ కార్యాలయంలో కొంత మంది అధికారులకు ముడుపులు ముట్టజెప్పి ఈ తతంగం మొత్తం నడిపించి ఎకరా చొప్పున డబ్బులు వసూలు చేసినట్లు పెద్ద ఎత్తు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ధరణిలో లోపాలు ఉన్నాయని, పోర్టల్ స్థానంలో కొత్త విధానాన్ని తీసుకొస్తామని చెబుతున్న నేపథ్యంలో బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో జరిగిన అక్రమాలపై కూడా విచారణ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండడంతో రెవెన్యూ అధికారుల గుండెల్లో రైల్లు పరుగెడుతున్నాయి.



**మెడికల్ షాపులను డి ఫార్మసి ( డిప్లమా ఇన్ ఫార్మసి) సర్టిఫికెట్లు ఉన్న వారు మాత్రమే నిర్వహించాలన్న నిబంధనలు ఉన్న వనపర్తి జిల్లాలో దాదాపు 30 శాతం అద్దె సర్టిఫికెట్లతో మెడికల్ షాపులను నిర్వహిస్తున్నారన్న విమర్శలు ఉన్నప్పటికీ అటు వైపు డ్రగ్స్ ఇన్స్‌స్పెక్టర్ అధికారులు కన్నెతి చూడక పోవడం చూసిన చూసి చూడనట్లుగా ఉన్నరన్న విమర్శలు బహిరంగగానే వినిపిస్తున్నాయి.**



# మెడికల్ షాపుల్లో..

# అద్దె సర్టిఫికేట్లు..!




- **సర్టిఫికెట్లు ఒకరివి.... నిర్వహణ మరొకరు ...**
- **జిల్లా వ్యాప్తంగా సగానికి పైగా అద్దె సర్టిఫికెట్లలతో యథేచ్ఛగా నిర్వహణ**
- **కన్నెతి చూడని అధికారులు**
- **డి ఫార్మసి సర్టిఫికెట్ల వారికి నెలవారి అద్దెలు చెల్లింపులు ...**

**వనపర్తి ప్రతినిధి, మార్చి 12, ప్రభాతవార్త :** మెడికల్ షాపుల నిర్వహణ చేయాలంటే విధిగా డిఫార్మసి చదివి ఉండాలి. జిల్లా వ్యాప్తంగా దాదాపు 200లకు పైగా మెడికల్ దుకాణాలు ఉండగా దాదాపుగా 30 శాతంకు పైగా అద్దె సర్టిఫికెట్లు పెట్టి నిర్వహణ చేస్తున్నారన్న విమర్శలు బహిరంగగా వినిపిస్తున్నాయి. మెడికల్ షాపుల నిర్వహణ ఒకరు, సర్టిఫికెట్లు ఇంకొకరు అన్నట్లుగా మారింది. డ్రగ్ ఇన్స్‌స్పెక్టర్ సంబంధిత అధికారులు జిల్లాలో విస్తృతంగా తనిఖీలు చేపట్టి మెడికల్ షాపుల నిర్వహణను గాలిలో పెట్టాల్సి ఉన్న అది ఎక్కడ అమలు కావడం లేదు. నెలసరి అద్దె సర్టిఫికెట్ల తోనే మెడికల్ షాపుల నిర్వహణ కొనసాగుతుంది. డ్రగ్స్ ఇన్స్‌స్పెక్టర్, సంబంధిత అధికారులు దాడులు చేపట్టాల్సి ఉన్న తూతూ మంత్రంగా మొక్కుబడిగా దాడులను నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితి రావడంతో మందులు తప్పనిసరి కావడంతో మెడికల్ షాపులు పుట్టగొడుగులుగా పుట్టుకు వచ్చాయి. మెడికల్ షాపుల ఏర్పాట్లు మొదలుకుని నిర్వహణ వరకు నిబంధనలు అమలు చేయాల్సి ఉన్నప్పటికి అవి ఎక్కడ అమలు కావడం లేదన్న విమర్శలు బహిరంగగానే వినిపిస్తున్నాయి. మెడికల్ షాపులు ఏర్పాటు చేయాలంటే ప్రస్తుత నిబంధనల ప్రకారంగా ఫార్మాసిస్టు సర్టిఫికెట్టు ఉన్న వ్యక్తి మెడికల్ షాపును ఏర్పాటు చేయాలి, ఆయననే నిర్వహించాలి. మెడికల్ షాపుకు అనుబంధంగా ఎలాంటి జనరల్ కౌంటర్లు ఏర్పాటు చేయకూడదు. మెడికల్ షాపుల్లో ఉండాల్సినవి ఉండకూడదవని అంటూ సవాలక్ష నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. కాని క్షేత్ర స్థాయిలో ఎక్కడ నిబంధనలు అమలు కావడం లేదు. అక్కడక్కడ మెడికల్ షాపులు కిరాణా షాపులను తలపిస్తున్నాయి.

**సర్టిఫికెట్లు ఒకరివి.... నిర్వహణ ఇంకొకరిది....**

అద్దె సర్టిఫికెట్లతో మెడికల్ షాపులు నిర్వహణ జరపరాదన్న నిబంధన ఉన్నప్పటికి అట్టి నిబంధనలను బేఖారతు చేస్తు యదేచ్ఛగా అద్దె సర్టిఫికెట్లతో నిర్వహణ మూడు పువ్వులు ఆరు కాయలుగా నిర్వహిస్తున్నారు. మెడికల్ షాపులపై దాడులు నిర్వహిస్తే అకస్మికంగా తనిచలు చేయాలని, అద్దె సర్టిఫికెట్లతో నిర్వహిస్తున్న మెడికల్ షాపులపై దాడులు నిర్వహించాలని ఆదేశాలున్నప్పటికి డ్రగ్స్ ఇన్స్‌స్పెక్టర్ సంబంధిత అధికారులకు చూసి చూడనట్లుగా ఉండడంపట్ల పలు అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. నర్సింగ్ హోమ్‌లు, ఆసుపత్రులు, పీఎంపీ, ఆర్ఎంపీలకు అనుబంధంగా కొనసాగుతున్న మెడికల్ షాపులతో పాటు బహిరంగ మార్కెట్ లో కొనసాగుతున్న దాదాపు 30 శాతం మెడికల్ షాపులు అద్దె సర్టిఫికెట్లతో నెట్టుకొస్తున్నాయి. నెలసరి డబ్బుల ఒప్పందంతో మెడికల్ షాపుల ఏర్పాటు చేసుకుని ఈ తతంగమంతా బాహటంగానే కొనసాగుతున్న డ్రగ్ ఇన్స్‌స్పెక్టర్, సంబంధిత అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు.

**ముందస్తు సమాచారం....**

మెడికల్ షాపుల ఏర్పాటు మొదలుకుని నిర్వహణ వరకు అంతా డ్రగ్ ఇన్స్‌స్పెక్టర్ కనుసన్నల్లోనే కొనసాగుతుంది. మెడికల్ షాపులు ఎవరు ఏర్పాటు చేస్తున్నారు సర్టిఫికెట్లు ఎవరివి సదరు మెడికల్ షాపుల్లో సర్టిఫికెట్ యజమాని ఉంటాడా, లేదా అన్న విషయాలు తెలిసినా ఔషధ నియంత్రణ మండలి అధికారులు అడ్డగోలుగా అనుమతులు ఇచ్చేస్తున్నారు. మెడికల్ షాపుల ఏర్పాటులో వేలాది రూపాయల చేతులు మారుతున్నాయన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. మండలాల్లో మెడికల్ షాపుల దాడులపై డ్రగ్ ఇన్స్‌స్పెక్టర్లు ఎప్పుడు దాడులు చేస్తారో ముందే సమాచారం చేరుతుండడం, అప్రమత్తం అవుతుండడం కొందరు షాపు నిర్వహకులు మూసి వేస్తుండడం ఇందుకు తార్కాణం. మెడికల్ షాపుల నిర్వహణ, ఏర్పాటు డ్రగ్ ఇన్స్‌స్పెక్టర్ మొక్కుబడి విధులు, ఔషధ నియంత్రణ అధికారుల ఆమ్మామ్య పర్వంపై అధికారులు కొరడా జులిపించాల్సి ఉంది. అద్దె సర్టిఫికెట్ల దందాపై కఠిన చర్యలను తీసుకోవాల్సి ఉండాలని పలువురు కోరుతున్నారు.

**అందుబాటులో ఉండని డ్రగ్ ఇన్స్‌స్పెక్టర్ ....**

జిల్లాలో పని చేస్తున్న డ్రగ్ ఇన్స్‌స్పెక్టర్ ఎప్పుడు కార్యాలయానికి వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి చోటు చేసుకుంది. గతంలో నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లా ఇంచార్జిగా విధులు నిర్వహిస్తూ గత నెల వనపర్తి జిల్లా డ్రగ్ ఇన్స్‌స్పెక్టర్‌గా పూర్తి స్థాయిలో భాధ్యతలు తీసుకున్నారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన సమయంలో అక్కడ ఉండరు పలుమార్లు ఫోన్ చేసినా ఎలాంటి రెస్పాన్స్ ఉండదు దాదాపుగా పదుల సంఖ్యలో ఫోన్లు చేస్తే ఫీల్డ్‌లో ఉన్నామంటూ సమాధానం ఇస్తూ దాటవేస్తున్నారు. అద్దె సర్టిఫికెట్ల విషయంపై పలుమార్లు ఫోన్లు చేసినా ఎలాంటి స్పందన లేదు. మెడికల్ షాపుల వద్ద ఎలాంటి ఇబ్బందులు ఉన్న ఫోన్‌లో సంప్రదించాలంటూ పేపర్ అతికించినప్పటికి ఫోన్‌లో స్పందించడంలో మాత్రం విఫలం అవుతున్నారన్న విమర్శలు ఉన్నాయి.

**అద్దె సర్టిఫికెట్లు నిర్వహణ చేసినట్లయితే చర్యలను తీసుకుంటాం...**

**ఫార్మాసిస్టు లేకుండా మెడికల్ షాపులు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి అటువంటి నిర్వాహకులపై చట్టపరమైన చర్యలను తీసుకుంటాం. జిల్లా వ్యాప్తంగా వ్యాప్తంగా అకస్మికంగా తనిఖీ చేయడం జరుగుతుంది. మెడికల్ షాపుల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు విధిగా పాటించాలి.**

**రష్మి, డ్రగ్ ఇన్స్‌స్పెక్టర్, వనపర్తి జిల్లా**

# పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి...

**సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలి**

**సోషల్ మీడియాను నియంత్రించే విధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి...**

**జిల్లా కలెక్టర్లు,రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం...**

**ఓటరు నమోదు ఫారాలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని..కలెక్టర్**

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్....**



వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్....



విసికి హాజరైన కలెక్టర్ రవినాయక్, అదనపు కలెక్టర్, అధికారులు

**మహబూబ్‌నగర్ బ్యూరో,మార్చి 12 ప్రభాతవార్త :** రానున్న పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు జిల్లా కలెక్టర్లు అన్ని ఏర్పాట్లతో సంసిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. మంగళవారం ఆయన హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ విషయమై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటరు జాబితాపై వచ్చిన అన్ని ఫిర్యాదులను విచారణ జరిపి ఎలాంటి తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ముద్రణకు ప్రింటింగ్ ప్రెస్‌ను ముందే గుర్తించాలని, పార్లమెంట్ ఎన్నికల్లో హోమ్ ఓటింగ్ ప్రక్రియ సక్రమ నిర్వహణకు సరైన ప్రణాళిక ముందు నుంచి సిద్ధం చేసుకోవాలని, ఈ విషయంలో ఎలాంటి తప్పులు చేయవద్దన్నారు. పోలింగ్ రోజు రికార్డింగ్ కోసం సరైన వెబ్ కెమెరాలు ఏర్పాటు చేయాలని, అంతేకాక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా అవసరమైన వీడియో సర్వేలెన్స్, విడియో వీక్షణ తదితర పనుల కోసం అవసరమైన కెమెరాలను ముందే సిస్టం చేసుకోవాలని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వ్యతిరేక వార్తలకు ఎప్పటికప్పుడు స్పందించి ఎన్నికల సంఘానికి పంపించే బాధ్యతను జిల్లా కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మోడల్ పోలింగ్ కేంద్రాలను బాగా తీర్చిదిద్దారని, అదేవిధంగా పార్లమెంట్ ఎన్నికలలో సైతం మంచి మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఇందుకు ముందే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, మోడల్ పోలింగ్ కేంద్రాలపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఆర్ఓ కార్యాలయంతో పాటు, జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో కమ్యూనికేషన్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సమాచారాన్ని ఈనెల 13లోగా పంపించాలని, ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది డేటా అప్డేషన్‌పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని చెప్పారు. అడిషనల్ సీఈఓ లోకేష్,సర్ఫరాజ్ అహ్మద్‌లు మాట్లాడుతూ ఓటరు జాబితా, పోస్టల్ బ్యాలెట్, పోలింగ్ స్టేషన్‌లో మౌలిక సదుపాయాలు, వివిధ రకాల నోడల్ టీములకు ఇచ్చే శిక్షణ కార్యక్రమాలు, ఎన్నికల వెలువడిన తర్వాత ప్రతిరోజు సమర్పించే నివేదికలు, పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెంటనే మీడియా సమావేశం, పొలిటికల్ పార్టీలకు సమాచారం, డిఫేస్‌మెంట్, అనుమతులు, ఫిర్యాదుల పరిష్కారం, ఎన్నికల ప్రవర్తన నియామావళి అమలు, సెక్టోరల్ అధికారుల నియామకం, హోం ఓటింగ్, నామినేషన్ల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై వివరించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి. రవినాయక్‌తో పాటు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, డిఆర్ఓ కెవివి రవికుమార్ తదితరులు ఈ విడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.

**గద్వాల ప్రతినిధి మార్చి 12 ప్రభాతవార్త:** పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి భారత ఎన్నికల సంఘం ద్వారా ఏ క్షణంలోనైనా షెడ్యూల్ వెలువడే అవకాశం ఉన్నందున ఎన్నికల నిర్వహణ కోసం అన్ని విధాలుగా సన్నద్ధమై ఉండాలని, ఎన్నికల ఏర్పాట్లను మరింత ముమ్మరం చేయాలని రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్ రాజ్ సూచించారు. మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్లు, అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఆయన ఎన్నికల నిర్వహణ అంశాలపై సుదీర్ఘ సమీక్ష జరిపారు. ఓటరు నమోదు, మార్పులు చేర్పులకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన, వాటి సత్వర పరిష్కారం 18-19 వయస్సు కలిగిన యువతచే ఓటరు జాబితాలో పేర్లు నమోదు కోసం దరఖాస్తులు చేయించడం, పోలింగు కేంద్రాల రేషనలైజేషన్ మోడల్ పీఎస్‌ల ఏర్పాటు, మృతి చెందిన వలస వెళ్లిన ఓటర్ల విషయంలో చేపట్టాల్సిన చర్యలు, సమస్యాత్మక అత్యంత సమస్యత్మాక పోలింగు కేంద్రాల గుర్తింపు, ఎన్నికల సిబ్బంది నియామకం, వారికి శిక్షణ తరగతులు నిర్వహించడం ఎలక్ట్రానిక్ ఓటింగు యంత్రాల రాండమైజేషన్ భద్రతాపరమైన ఏర్పాట్లు తదితర అంశాలను సమీక్షిస్తూ, జిల్లా ఎన్నికల అధికారులకు మార్గనిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్సులో జిల్లా అదనపు కలెక్టర్లు అపూర్వచౌహాన్, ముసిని వెంకటేశ్వర్లు, స్వీప్ నోడల్ అధికారి ఎంపీ రమేశ్ బాబు, ఈడియం శివ తదితరులు ఉన్నారు.

**వనపర్తి ప్రతినిధి, మార్చి 12,ప్రభాత వార్త :** తుది ఓటరు జాబిత ప్రకటన తర్వాత వచ్చిన కొత్త ఓటరు నమోదు ఫారాలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ సూచించారు.రానున్న పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ - మిగతా4లో..



ఎన్నికల అధికారి వికాస్ రాజ్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్



కాన్ఫరెన్స్ కు హాజరు అయినా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్

## మంత్రుల పర్యటన ఏర్పాట్లను

# పర్యవేక్షించిన ఎమ్మెల్యే, డీఎస్పీ లింగయ్య

**నారాయణపేట ప్రతినిధి, మార్చి 12 ప్రభాతవార్త :** నియోజకవర్గంలో సం గంబండ ప్రాజెక్టులో పెండింగ్ పనులను పరిశీలించేందుకు బుధవారం ఉదయం భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌లు వస్తున్నందున సంగంబండ గ్రామంలోని హెలిప్యాడ్ సభస్థలి పార్కింగ్ పనులను ఎమ్మెల్యే వాకిటిశ్రీహరి, జిల్లా ఎస్పీ యోగేష్, నారాయణపేట డీఎస్పీ లింగయ్య, సిఐ చంద్రశేఖర్, ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి దగ్గరుండి పర్యవేక్షించారు అలాగే హెలిప్యాడ్ పనుల ను, పార్కింగ్,సభాస్థలి పనులను పరిశీలించారు. ప్రాజెక్టులో ఎడమలో యెస్టు కెనాల్‌లో దాదాపు 300 మీటర్ల పొడవైన బండరాయి అడ్డు రావడంతో కెనాల్ కాల్వ ప్రారంభానికి నోచుకోలేదు. దాదాపు 12 గ్రామాలలోని 3వేల ఎకరాలభూమి సాగుకు నోచుకోలేదు. ఈపెండింగ్ పనులపై గత ప్రభు త్వాలు బూచిగా చూపించి ఎన్నికల్లో పలు పార్టీల నాయకులు ఓట్లు దండు కుంటున్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అడ్డుగా ఉన్న బండరా యిని తొలగిస్తామని ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిం ది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున ఇచ్చిన మాటకు అను గుణంగా బండను తొలగించి కాలువను పునరుద్ధరించేందుకుగాను నెల రోజు ల కిందట నిధులు మంజూరు చేసింది. పనులు ప్రారంభించడానికి ప్రస్తుతం ఎన్నికల కోడ్ అడ్డు రావడంతో శంకుస్థాపన చేయకుండానే పనులు చేయించడానికి పర్యవేక్షించేందుకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, భారీ సాగునీటి ప్రాజెక్టుల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలు రావడం జరుగుతుందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తెలిపారు.



పనులు పర్యవేక్షిస్తున్న జిల్లా ఎస్పీ, ఎమ్మెల్యే

## త్వరలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్


# మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేస్తాం : ఎమ్మెల్యే యెన్నం

**ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులకు ఇది సువర్ణ అవకాశం**

**మహబూబ్‌నగర్ బ్యూరో,మార్చి 12 ప్రభాతవార్త :** రాబోయే రెండు, మూడు వారాల్లోపు తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) సంస్థ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ పట్టణంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు ఐటిశాఖ మంత్రి శ్రీధర్‌బాబు అనుమతి ఇచ్చారని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్ దగ్గర గల టాస్క్ కార్యాలయంలో టాస్క్ సీఈఓ శ్రీకాంత్‌తో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం మహబూబ్‌నగర్ పట్టణంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు గురించి చర్చించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఐటిఐ ఒకేషనల్ ఇంటర్, డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు వేలాదిమంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా సరైన కోర్సులలో నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్‌లలో శిక్షణ ఇప్పించి వారి స్కిల్స్‌ను ప్రపంచానికి పరిచయం చేయాలనే ఉద్దేశంతో టాస్క్‌సంస్థ ఆధ్వర్యంలో రాబోయే రెండు మూడు వారాలలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభం చేయబోతున్నట్లు ఆయన తెలిపారు. అనతి కాలంలోనే ఈ సెంటర్‌ను మహబూబ్‌నగర్ పట్టణంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీగా రూపాంతరం చేయడానికి కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే మహబూబ్‌నగర్ పట్టణంలో స్కిల్ డెవలప్‌మెంట్ బిల్డింగ్ నిర్మాణనికి అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ ద్వారా 20 కోట్ల రూపాయలను ఆర్అండ్‌బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. మహబూబ్‌నగర్‌ను స్కిల్ డెవలప్‌మెంట్ హబ్‌గా మార్చేందుకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు కోసం అనుమతి ఇచ్చిన రాష్ట్ర ఐటిశాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు, టాస్క్ సీఈఓ శ్రీకాంత్‌కు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు.




ఎమ్మెల్యేకు జ్ఞాపిక అందజేస్తున్న టాస్క్ సంస్థ సభ్యులు



సంస్థ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి


## వార్త విలేకరులు కావలెను

ప్రముఖ తెలుగు జాతీయ దినపత్రిక వార్తలో వివిధ మండలాలకు పనిచేయుటకు విలేకర్లు కావలెను.

**విలేకరులు కావాల్సిన ప్రాంతాలు**

**నారాయణపేట జిల్లా :** నారాయణపేట, రూరల్, క్రైం, మాగనూరు, నర్వ, కృష్ణ, మరికల్,కోస్గి, గుండుమాల్, కొత్తపల్లి, మద్దూర్,దామరగిద్ద, ధన్వాడ,మద్దూర్, ఫోటో గ్రాఫర్

**వనపర్తి జిల్లా :** వనపర్తి మండలం, వనపర్తి అర్బన్

**అర్హత :** ఇంటర్, డిగ్రీ తెలుగు భాషపై పట్టు, సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలి.

**ఇంటర్వ్యూ తేది:**
తేది: 15.03.2024 (శుక్రవారం) ఉదయం 11 గం.కు జడ్చర్ల యూనిట్ కార్యాలయం నందు ఇంటర్వ్యూకు హాజరు కాగలరు.

సెల్: 9441615424

## పరిసరాల పరిశుభ్రతపై కార్యాచరణ చేపట్టాలి...

**మున్సిపాలిటీ కమిషనర్ కు సన్మానం.. మున్సిపాలిటీ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్..**

**వనపర్తి ప్రతినిధి, మార్చి 12, ప్రభాతవార్త :** మున్సిపల్ పరిధిలోని శానిటేషన్ పై పరిసరాల పరిశుభ్రత పై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని మున్సిపాలిటీ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ మున్సిపాలిటీ కమీషనర్ పూర్ణచందర్‌ను కోరారు. ఇటీవల బదలీలో భాగంగా వనపర్తి మున్సిపాలిటీ కి కమీషనర్‌గా వచ్చిన పూర్ణ చందర్ ను స్థానిక కౌన్సిలర్లతో కలిసి శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ...రానున్న ఎండాకాలంలో నీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పట్టణ అభివృద్ధి కోసం స్థానిక కౌన్సిలర్ల సహకారం సంపూర్ణంగా ఉంటుందని ఆయన తెలిపారు. కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ విషయంలో రాజీ పడకుండా పనిచేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కాగితాల లక్ష్మీనారాయణ, బండారు కృష్ణ, నాగన్న తదితరులు పాల్గొన్నారు.



## శ్రీశ్రీశ్రీ జములమ్మ అమ్మవారిని దర్శించుకున్న మున్సిపల్ చైర్మన్ దంపతులు

**గద్వాల ప్రతినిధి మార్చి 12 ప్రభాతవార్త:** గద్వాల్ జిల్లా కేంద్రంలోని జమ్మిచేడులో వెలసిన శ్రీశ్రీశ్రీ జములమ్మ అమ్మవారు పరుశరాముడు స్వామి వారిని మంగళవారం మున్సిపల్ చైర్మన్ దంపతులు బియస్ కళావతి కేశవ్‌లు దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అధికారులు మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమం మహా మంగళహారతి కుంకుమార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయనిర్వాహకులు చైర్మన్ దంపతులకు స్వామి శేషవస్త్రంతో ఘనంగా సత్కరించి జములమ్మ అమ్మవారిఆశీసులు పొందడం జరిగింది. ప్రజలందరు సుఖసంతోషాలతో అష్టైశ్వర్యాలతో దిన, దినాభివృద్ధి చెందాలని అమ్మవారిని కోరుకున్నాట్లు చైర్మన్ దంపతులు తెలిపారు.



## ప్రజాదీవెన సభను విజయవంతం చేయండి..

**ఆత్మకూర్ మార్చి 12, ప్రభాతవార్త :** ఈ నెల 13న మక్తల్ నియోజకవర్గంలోని సంఘం బండ ఆవరణలో జరగనున్న ప్రజా దీవెన సభను కాంగ్రెస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు, పాల్గొని విజయవంతం చేయాలని ఆత్మకూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తులసిరాజు యాదవ్ మాజీ మండల పార్టీ అధ్యక్షులు రహమతుల్లా తదితరులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు మంగళవారం ఆత్మకూరులో విలేకరులతో మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మహబూబ్‌నగర్ పార్లమెంటు అభ్యర్థిగా వంశీచంద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి గెలిపించేందుకు మక్తల్ నియోజకవర్గం ప్రజలు ఉన్నారని అందులో భాగంగానే ఆత్మకూరు మండలం నుండి అధిక మెజార్టీ సాధించేందుకు కార్యకర్తలు, నాయకులు, ప్రజలు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.



## దేశంలోనే అతి పెద్ద గిరిజన పండుగ సమ్మక్క సారక్క జాతర:ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి టౌన్, మార్చి 12, ప్రభాతవార్త :** దేశంలోనే అతిపెద్ద గిరిజన పండుగగా జరుపుకొనే జాతర సమ్మక్క సారక్క జాతర అని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. టిఎస్ఆర్‌టిసి ద్వారా బుకింగ్ చేసిన ప్రసాదాన్ని మంగళవారం ఆర్టీసీ అధికారులు ఎమ్మెల్యేకు అందజేశారు. అధికారుల నుంచి ప్రసాదాన్ని అందుకున్న ఎమ్మెల్యే ప్రజల సంక్షేమం కోసమే ఈ ప్రసాదం బుక్ చేశామని ప్రసాదాన్ని ప్రజలకు పంపిణీ చేయాలని సూచించారు. ఆర్టీసీ సిఐ దేవేందర్ గౌడ్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ మసూద్, కూరగాయల రవి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## మరణించిన కుటుంబానికి మేఘా ఒడ్డి అభయ హస్తం

**వనపర్తి టౌన్, మార్చి 12, ప్రభాతవార్త :** వనపర్తి పట్టణంలో 19వ వార్డులో మైబు తాపీ మేస్త్రి అనారోగ్యం బాగా లేక నిన్న మరణించడం జరిగింది. ఆవార్డుకు చెందిన పిడి జయనందం ద్వార పోగు వెంకటేష్ వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి సమాచారం ఇవ్వగా ఎమ్మెల్యే మరణించిన కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేయడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్కాకుల సతీష్ వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల విజయ్ చందర్ కౌన్సిలర్స్ వెంకటేశ్వర్లు లక్ష్మీ రవి యాదవ్ ఓబీసీ పట్టణ అధ్యక్షులు బొంబాయి మన్నెంకొండ సూరి ఈఎస్ శ్రీనివాసులు పి వెంకటేష్ సింగోటం నాయుడు తిరుపతయ్య అందరు కలిసి మరణించిన మైబు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుం దని హామీ ఇవ్వడం జరిగింది.



## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ ..

**శ్రీరంగాపురం మార్చి 12 ప్రభాతవార్త:** మండల పరిధిలోని తాటిపాముల ప్రాథమికోన్న త పాఠశాలలో మంగళవారం విద్యార్థులే ఉపాధ్యాయులై ఘనంగా స్వయంపరిపాలన దినోత్సవం నిర్వహించారు. మొత్తం 33మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవ హరించారు. ధరణి కుమార్ ప్రధానోపాధ్యా యులుగా వ్యవహరించగా హారిక మండల విద్యాధికారిగా వ్యవహరించి ప్రతి తరగతి గదిని సందర్శించి ఉపాధ్యాయులు బోధనను పరిశీలించారు. ఉపాధ్యాయులు ఆకర్షణీయమైన బోధనోపకరణాలతో ఆకట్టుకునేలా వినూత్న బోధన గావించారు. ఈ కార్యక్రమం అనంతరం అత్యుత్తమ బోధన అందించిన ఉపాధ్యాయులుగా వ్యవహరించిన అందరి ఉపాధ్యాయులకు బహుమతులు అందించారు. తదనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రాంగణాన్ని హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రయ్య, ముఖ్య అతిథులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రాములు యాదవ్, సింగిల్ విండో డైరెక్టర్ వాసుదేవ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు కురుమన్న, గ్రామ మాజీ సర్పంచు సత్యనారాయణ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎల్లస్వామి, మద్దిలేటి ఉషన్, పాఠశాల ఉపాధ్యాయులు శేఖర్ రెడ్డి, రేణుక, మాధవిలత, రాజు, రవి, మండల సముదాయ పరిధిలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## విజయ సంకల్ప సమ్మేళనం భారీ బహిరంగ సభకు బయలుదేరిన బిజెపి నాయకులు

**పెద్దమందడి, మార్చి 12, ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో విజయ సంకల్ప సమ్మేళనం భారీ బహిరంగ సభకు మంగళవారం పెద్దమందడి మండల బూత్ అధ్యక్షులు, మండల సీనియర్ నాయకులు, మండల అధ్యక్షులు కె.తిరుపతయ్య ఆధ్వర్యంలో 50 మంది కార్యకర్తలు ఎల్బీ స్టేడియంకు బయలుదేరారు. ఈ సందర్భంగా తిరుపతయ్య మాట్లాడుతూ..ఎల్బీ స్టేడియంలో జరిగే బూత్ అధ్యక్షులతో విజయ సంకల్ప సమ్మేళన కార్యక్రమానికి పెద్దమందడి మండల పరిధి నుండి బిజెపి పార్టీ శ్రేణులు బయలుదేరి వెళ్లడం జరిగిందన్నారు. బిజెపి అధికారంలోకి తీసుకొచ్చిన నరేంద్ర మోదీని ప్రధానమంత్రిని చేసి, దేశంలో ప్రపంచంలో విశ్వగురు స్థానంలో నిలపడం కోసం చలో హైదరాబాద్ విజయ సంకల్ప సభను విజయవంతం చేయాలని ఆయన అన్నారు. పెద్దమందడి మండల పరిధిలోని బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో అమిత్ షా సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి పోలింగ్ బూత్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.



# గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి..

**వనపర్తి టౌన్, మార్చి 12, ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ మరియు వర్కర్స్ యూనియన్ సిఐటియు వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నాడు డిపిఓ రమణమూర్తికి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు మండ్ల రాజు మాట్లాడుతూ, గ్రామపంచాయతీ సిబ్బందికి గత నాలుగు ఐదు, నిలబకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని, గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేసి వేతనాలు చెల్లించాలని, కారోబార్ బిల్ కలెక్టర్లను సహాయం కార్యదర్శులు నియమించాలని, మల్టీపర్పస్ వర్కర్స్ విధానం రద్దు చేయాలని. పీఎఫ్, ఈఎస్ఐ ప్రమాద బీమా ఇన్సూరెన్స్ తదితర సమస్యలు పరిష్కరించాలని, గ్రామాల్లో పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, వీధిలైట్స్, డంపింగ్ యార్డ్స్, హరితహారం, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు తదితర పనుల్లో నిత్యం శ్రమిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి అంటూ వ్యాధులు అనారోగ్యాలు రాకుండా ప్రజలకు సేవలు అందిస్తున్నారు. వీరిలో అత్యధికలు దళితులు, బలహీన వర్గాలకు చెందిన పేద కార్మికులు, చాలీచాలని వేతనాలతో అప్పులు చేసుకుని బతకాల్సిన పరిస్థితి రాష్ట్రంలో గ్రామపంచాయతీ సిబ్బందికి ఏర్పడిందని ప్రభుత్వం పై మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఉద్యోగులకు నెలలో మొదటి రోజు వేతనాలు చెల్లిస్తుందని, గొప్పలు చెప్పుకుంటుంది. కానీ, గ్రామపంచాయతీ కార్మికులకు ఐదు నెలలు గడుస్తున్న వేతనాలు చెల్లించకపోవడం దారుణం అన్నారు. వేతనాలు చెల్లించకపోతే టిఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టిన గతే, ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ కూడా పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశం రాము. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్. సిఐటియు అనుబంధం జిల్లా అధ్యక్షులు, హనుమంత్, జిల్లా కోశాధికారి పుష్ప. జిల్లా నాయకులు. హనీఫ్, శీను, దాసు ఎల్లయ్య, సుగ్రీవుడు. రాము శివ అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.



డిపిఓ రమణమూర్తికి వినతిపత్రం ఇస్తున్న గ్రామపంచాయతీ ఉద్యోగ సంఘాలు

## విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడానికే టాలెంట్ టెస్ట్ పరీక్షలు...

**- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యం.తారాసింగ్ - నాగర్‌కర్నూల్ ఎంఈఓ భాస్కర్‌రెడ్డి**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి12 ప్రభాతవార్త:** విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడానికే టాలెంట్ టెస్ట్ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడుతాయని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యం.తారాసింగ్, నాగర్‌కర్నూల్ ఎంఈఓ భాస్కర్‌రెడ్డిలు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎస్సెస్సీ టాలెంట్ పరీక్షలను స్థానిక నేషనల్ హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను బయటకు తీయడం కోసం ఈ టాలెంట్ టెస్ట్ ఉపయోగపడుతుందని, గత 30 సంవత్సరాల నుంచి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఈ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు భయాందోళనకు గురికాకుండా ఉండటానికే ఈ పరీక్షలు ఉపయోగపడుతాయన్నారు. మొదటి బహుమతి రూ.3వేలు, ద్వితీయబహుమతి రూ.2వేలు, తృతీయబహుమతి రూ.వెయ్యిలు ప్రకారం విద్యార్థులకు ఇవ్వబడుతుందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు వహిద్‌ఖాన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎండి.సయ్యద్, జిల్లా ఉపాధ్యక్షులు కార్తీక్, జిల్లా నాయకులు సుల్తాన్ రవి, లక్ష్మణ్, కుర్మయ్య, అవినాస్, గణేష్ తదితరులు ఉన్నారు.



టాలెంట్ టెస్ట్ పరీక్ష పత్రం విడుదల చేస్తున్న దృశ్యం

## డిఎస్సి ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి : ప్రవీణ్

**గద్వాల ప్రతినిధి మార్చి 12 ప్రభాతవార్త:** డీఎస్సీ, ఎస్‌జిటి, రిక్రూట్‌మెంట్ ఉచిత శిక్షణ కొరకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జోగులాంబ గద్వాల బిసి స్టడీ సర్కిల్ సంచాలకులు టి.ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బిసి స్టడీ సర్కిల్ , డిఎస్సి ఎస్‌జిటి రిక్రూట్‌మెంట్ 2024 ఉచిత శిక్షణను ఈ నెల 26 నుండి బిసి స్టడీ సర్కిల్ జోగులాంబ గద్వాల జిల్లాలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన జోగులాంబ గద్వాల వనపర్తి జిల్లాలకు చెందిన బిసి, ఎస్సి, ఎస్టి ఈబీసీ అభ్యర్థులు ఈ ఉచిత శిక్షణ కొరకు ఆన్‌లైన్‌లో బిసి స్టడీ సర్కిల్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 14 నుండి 22వ తేది వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల యొక్క కుటుంబ వార్షిక ఆదాయం రూ.5 లక్షలు మించరాదని, రిజర్వేషన్ ప్రకారం ఎస్‌జిటి సంబంధించి ఇంటర్మీడియట్, డైట్, టెట్‌లో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల యొక్క యస్‌యస్‌సి, ఇంటర్, డిఎడ్ , టెట్ మార్కుల మెమో, లేటెస్ట్ క్యాస్ట్, లేటెస్ట్ ఇన్‌కమ్, ఆధార్‌కార్డు, ఫోటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. నిబంధనల ప్రకారం స్టడీ మెటీరియల్ అందిస్తామని, ఇంతకు ముందు బిసి స్టడీ సర్కిల్ నందు శిక్షణ పొందిన అభ్యర్థులు ఈ ఉచిత శిక్షణకు అనర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెం.08546 293022, 9908560268 లేదా టిటియన్ బిల్డింగ్ , పాత యల్ఐసి ఆఫీసు మొదటి రైల్వే గేట్ దగ్గర గద్వాల టౌన్ జోగులాంబ గద్వాల జిల్లా నందు ఆఫీసు వేళలలో సంప్రదించాలన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు సహకరించాలి..

**- పాఠశాలలో విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ**

**కల్వకుర్తిరూరల్, మార్చి 12 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతల సహకారం అవసరమని కల్వకుర్తి లయన్స్‌క్లబ్ అధ్యక్షులు కలిమిచెర్ల రమేష్ పేర్కొన్నారు. మంగళవారం కల్వకుర్తి మండలంలోని పంజుగుల గ్రామ ప్రభుత్వ ప్రాథమికొన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి కుమార్తె గోలి సాత్విక జన్మదినాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు ప్లేట్లను పంపిణీ చేశారు. గోలి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో లయన్స్‌క్లబ్ ఆఫ్ కల్వకుర్తి ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కొరకు ఉచితంగా 130 మంది విద్యార్థులకు ప్లేట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ కల్వకుర్తి అధ్యక్షులు కలిమిచెర్ల రమేష్, లయన్స్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి చిగుళ్లపల్లి శ్రీధర్, మెంబరిషిప్ కమిటీ అధ్యక్షులు కిషన్‌కుమార్, లయన్స్‌క్లబ్ ఆఫ్ కల్వకుర్తి సభ్యులు దారమోని గణేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్లయ్యగౌడ్, ఉపాధ్యాయులు ఉమాదేవి, తిరుపతమ్మ, కృష్ణయ్య, పాండయ్య, పుష్పలత, కార్యదర్శి కృష్ణ, గ్రామస్తులు పాలెపు రాజేష్ తదితరులు ఉన్నారు.




విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

## హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్‌లో రెండు రోజుల శిక్షణ

**గద్వాల ప్రతినిధి మార్చి 12 ప్రభాతవార్త:** హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా హైదరాబాద్‌లో బ్యాంకింగ్‌అండ్ ఫైనాన్స్‌లో రెండునెలల నాన్ రెసిడెన్సియల్ ప్రీ ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు జిల్లా బి.సి అభివృద్ధి అధికారిణి బి.సరోజ ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకింగ్ అండ్‌ఫైనాన్స్ ట్రైనింగ్ ప్రోగ్రాం పూర్తయిన తర్వాత ప్రైవేట్‌బ్యాంకుల్లో ప్లేస్‌మెంట్ ఉంటుంది. గ్రా డ్యుయేట్, 26సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న అభ్యర్థులు ఈనెల15 నుండి25వ తేదీవరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. పై శిక్షణ కార్యక్రమానికి బిసి అభ్యర్థిలు అర్హులు. ఆన్ లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ను ఈనెల 31న ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తారు. అర్హులైన అభ్యర్థిలు తేదీ: 15.03.2024 నుండి 25.03.2024వరకు ఆన్‌లైన్‌ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5లక్షలలోపు ఉండాలి. ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా 30 మంది అభ్యర్థి లను ఎంపిక చేసి వారికి ఉచిత శిక్షణ ఇవ్వబడుతుంది. మరిన్ని వివరాలకు ఫోన్ నెం:లేదా బి.సి స్టడీ సర్కిల్ ఆఫీస్, టి.టి.యన్ బిల్డింగ్ పాత యల్.ఐ.సి ఆఫీసు మొదటి రైల్వే గేట్ దగ్గర, గద్వాల టౌన్, జోగుళాంబ గద్వాల జిల్లా నందు ఆఫీసు వేళలలో సంప్రదించగలరు అని తెలిపారు.

## లయన్స్‌క్లబ్ ఎక్సలెంట్ ప్రెసిడెంట్‌గా కలిమిచెర్ల రమేష్

**-కల్వకుర్తి లయన్స్‌క్లబ్‌కు అవార్డుల పంట**

**కల్వకుర్తి, మార్చి 12 ప్రభాతవార్త:** లయన్స్‌క్లబ్ ఇంటర్నేషన్ రీజియన్ సమావేశం హైదరాబాద్‌లోని ఏపీఆర్ గార్డన్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి రీజియన్ పరిధిలోని 11 క్లబ్‌లకు సంబంధించిన సభ్యులు హజరయ్యారు. ఈ సంవత్సరం ఆయా క్లబ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమాలకు రీజియన్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అవార్డులను అందించారు. క్లబ్ ద్వారా నిర్వహించిన సేవలను కొనియాడారు. కల్వకుర్తి లయన్స్‌క్లబ్ అధ్యక్షులు కలిమిచెర్ల రమేష్‌కు ఎక్స్‌లెంట్ ప్రెసిడెంట్ అవార్డును లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ నరేందర్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. అవార్డుతో పాటు సభ్యుల చేరికలు చేసినందుకు ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ నుంచి పిన్నును రమేష్‌కు అలకరించారు. దీంతో పాటు కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి శ్రీనివాస్‌లకు అవార్డులను అందించారు. ఈ సందర్భంగా కలిమిచెర్ల రమేష్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలకు ఎన్నో అవార్డులు ప్రశంసలు అందుకున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి మరికొన్ని అవార్డులను అందుకునేందుకు ముందుకు సాగుతామన్నారు.




అవార్డులు అందుకుంటున్న కల్వకుర్తి లయన్స్‌క్లబ్

## గుర్తింపు లేని వాహనాలకు బహిరంగ వేలం..

**వనపర్తి టౌన్, మార్చి 12, ప్రభాతవార్త:** వనపర్తిజిల్లా పోలీసుశాఖ తనిఖీలలో పట్టుబడ్డ మరియు దొరికిన వాహనాలను ఎవరు తీసుకొనిపోనందున వాటిని బహిరంగ వేలం చేయడం జరుగుతుందని జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు రక్షిత కె మూర్తి తెలిపారు. ఇప్పటివరకు పోలీసు అధీనములో 78 వాహనాలు ఉన్నట్లు తెలిపారు. ఈ వాహనాలకు సంబంధించిన వివరాలను ఫేసుబుక్ / ట్విట్టర్ మరియు ఇతర సామాజిక మాధ్యమలో ఉంచినట్లు ఎస్పీ తెలిపారు. ఇందులో 2 నాలుగు చక్రాల వాహనాలు, 3 మూడు చక్రాల వాహనాలు, 73 ద్విచక్ర వాహనాలు ఉన్నట్లు వివరించారు. వీటిని ఏ.ఆర్ హెడ్ క్వార్టర్స్ నాగవరం వనపర్తి నందు ఉంచినట్లు తెలిపారు. ఈ వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ నెంబర్, ఇంజన్ నెంబర్, చాసిస్ నెంబర్ ఆధారంగా గుర్తించి బాధితులకు అప్పగించడం జరుగుతుందన్నారు. వాహనం యొక్క ఆర్.సి సర్టిఫికెట్లు తీసుకొని జిల్లా కేంద్రంలోని ఎస్.పి కార్యలయంలో నోడల్ ఆఫీసర్ ఏ.శ్రీనివాస్ కుమార్, రిజర్వు ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (ఎం.టీ.ఓ, డిఎఆర్ వనపర్తి (సెల్ 8712670604)ని సంప్రదించాలని అన్నారు. ఈ వాహనాలను ఎవరు స్వీకరించని పక్షంలో వాటికి ప్రచురణ జరిగిన (07) వ రోజు నుండి అనగా తేదీ: 20.03.2024 నాడు చట్టప్రకారం బహిరంగ వేలం వేయబడుతుందన్నారు.

## ఎలక్ట్రోరల్ బాండ్లు బహిర్గతపరచాలి..

**సిపిఎం మండల కార్యదర్శులు గోపాల్, అంజయ్య**

**నారాయణపేట ప్రతినిధి, మార్చి 12 ప్రభాతవార్త :** సుప్రీంకోర్టు ఆదేశాలను పెడచెవిన పెట్టిన ఎస్‌బిఐ బ్యాంక్ చైర్మన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని, అదేవిధంగా బిజెపి ప్రభుత్వం అవినీతిని బయట పెట్టాలని సిపిఎం కేంద్ర రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు నారాయణపేట జిల్లా దామరగిద్ద మండల కేంద్రంలోని ఎస్‌బిఐ బ్యాంకు ముందు సిపిఎం మండల కమిటి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో భాగంగా దామరగిద్ద సిపిఎం మండల కార్యదర్శి గోపాల్, సిపిఎం నాయకులు అంజిలయ్యలు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలక్ట్రోరల్ బాండ్లను ఎస్‌బిఐ సంస్థ సిబ్బంది బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అవినీతిని ప్రజల ముందు బయట పెట్టాలని ఈ జాప్యానికి సహకరిస్తున్న ఎస్‌బిఐ చైర్మన్‌ను వెంటనే అరెస్టు చేయాలని ఎలక్ట్రోరల్ బాండ్ల వివరాలను సుప్రీంకోర్టు గడువు మేరకు బహిర్గతపరచాలని అవినీతికి పాల్పడ్డ బిజెపి ప్రభుత్వంపై సుప్రీంకోర్టు తగు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు జోషి, మొగులప్ప, నారాయణ, వెంకటప్ప, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.




బ్యాంకు ముందు నిరసన చేస్తున్న నాయకులు, రైతులు

## మాజీ మంత్రిని కలిసిన ప్రవీణ్ కుమార్

**వనపర్తి ప్రతినిధి, మార్చి 12, ప్రభాతవార్త :** మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని మంగళవారం హైదరాబాద్ లోని నివాస గృహంలో బి.యస్.పి చీఫ్ ప్రవీణ్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ దంపతులను మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి దంపతులు శాలువాతో ఘనంగా సన్మానించారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికలలో బి.ఆర్.యస్, బి.యస్.పి సంయుక్తంగా పోటీ చేస్తున్న సందర్భంగా రాజకీయపరిస్థితుల గురించి చర్చించడం జరిగింది. బావ స్వారుప్యభావాలు కలిగినపార్టీలు కలిసి పనిచేయడంవల్ల ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేయడానికి ఆస్కారం ఉంటుందని, ఒకరికి ఒకరం సహకరించుకొని ఓట్ల మార్పిడి సంపూర్ణంగా జరిగే విధంగా ఇరు పక్షాలు కృషి చేదామని మంత్రి అన్నారు.



## నిబంధనలకు లోబడి లే అవుట్లకు అనుమతి ఇవ్వాలి: అదనపు కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి, మార్చి 12 ప్రభాతవార్త :** నిబంధనలకు లోబడి లే అవుట్లకు అనుమతి ఇవ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్ అన్నారు. మంగళవారం నారాయణపేటలోనిసర్వే నం. 197,392 లే ఔట్లను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లే అవుట్ చేసిన స్థలాలను అదనపు కలెక్టర్ పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పాతపాలెంలో స్వయం పరిపాలన..



**కేటిదొడ్డి, మార్చి 12 ప్రభాతవార్త :** కేటిదొడ్డి మండల పరిధిలోని పాతెం గ్రామంలో ఇండియన్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో మంగళవారం స్వయంపరిపాలన దినోత్సవ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహించారు. కలెక్టర్‌గా మనోజ్ఞ, డీఈఓగా విశాల్, ఎంఈఓగా రవికుమార్, ప్రధానోపాధ్యాయులుగా విజయ్, విద్యార్థులు, ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పవిత్ర రంజాన్ మాసాన్ని పకడ్బందీగా నిర్వహించుకుందాం:ఎమ్మెల్యే

**వనపర్తి టౌన్, మార్చి 12, ప్రభాతవార్త :** ముస్లిం సోదరులకు ఎంతో పవిత్ర మాసమైన రంజాన్ మాసాన్ని అందరి సహకారంతో పకడ్బందీగా నిర్వహించుకుందామని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వనపర్తి నియోజకవర్గ పరిధిలోని ముస్లిం సోదరులందరూ రంజాన్ మాసాన్ని పవిత్రంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రార్థన మందిరాల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ఇబ్బందులు లేకుండా, సమస్య లేకుండా ఉండేందుకు ఈద్గాల దగ్గర వద్ద పరిశుభ్రం దాత, మంచినీళ్ల సౌకర్యం ఉండే విధంగా సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.




## హైదరాబాద్‌కు తరలి వెళ్లిన బిజెపి శ్రేణులు..



**అమరచింత, మార్చి 12, ప్రభాతవార్త :** హైదరాబాదులోని ఎల్బీ స్టేడియంలో జరిగే బిజెపి బూత్ కమిటీ అధ్యక్షుల సమావేశానికి మంగళవారం అమరచింత మండల కేంద్రంలోని బిజెపి పార్టీ ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కేంద్ర హొంశాఖ మంత్రివర్యులు అమిత్‌షా హాజరవుతున్నారని బిజెపి పట్టణ అధ్యక్షులు, క్యామ భాస్కర్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థుల విజయం కోసం పార్టీ కార్యకర్తలకు దిశ నిర్దేశం చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, విజయ్ యాదవ్, నరాల సిద్దు, అనిల్, అఖిల్, రాకేష్ శెట్టి, కే ఆంజనేయులు, హమాలి రవి, మస్తిపురం వేణు తదితరులు తరలివెళ్లారు.

## నర్సరీలను పరిశీలించిన ఎంపిడిఓ

**ఉప్పునుంతల, మార్చి 12 ప్రభాతవార్త :** మండల పరిధిలోని మర్రిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న నర్సరీని ఎంపిడిఓ లక్ష్మణ్‌రావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రధాన రోడ్డుకు ఇరువైపులా నాటిన చెట్లకు నీరు పోశారు. నాటిన ప్రతి మొక్కకు నీరుపోసి కాపాడుకోవాలని ఆయన సూచించారు. నర్సరీల నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహించవద్దన్నారు. వేసవిలో నర్సరీలను కాపాడుకునే బాధ్యత మన రక్షకులపై ఉందన్నారు. సమయానికి మొక్కలకు నీళ్లు పోసి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, స్థానిక అంగన్‌వాడి కార్యకర్త సంజన పాల్గొన్నారు.



## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



**జడ్చర్ల, మార్చి 12 ప్రభాతవార్త:** జడ్చర్లలోని మండల పరిషత్ ప్రైమరీ స్కూల్‌లో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఇందులో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధిక, ఉపాధ్యాయులు బి.మొగిలన్న,పి.అరుణ, అరుంధతీదేవి, పి.శిరీష ఉమారాణి పాల్గొన్నారు. కలెక్టర్‌గా శృతి, డిప్యూటి కలెక్టర్‌గా వైష్ణవి, డీఈఓగా అక్షత, ఎంఈఓగా పూజిత,హెచ్‌ఎంగా మేఘన,ఉపాధ్యాయులుగా ఇ.అశోక్, ఎం. హర్షిత, బి. నందిని,కె. కిరణ్, కె. భరత్ తదితరులు పాల్గొన్నారు.

**ఇటిక్యాల మార్చ్ 12 ప్రభాతవార్త:** మండల పరిధిలోని రాజశ్రీ గార్లపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులే ఉపాధ్యాయులై స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌గా రేఖ, జిల్లా విద్యాధికారిగా ప్రణీత, మండల విద్యాధి కారిగా నాగవేణి, ప్రధానోపాధ్యాయుడు గా శివ విద్యార్థులు ఉపాధ్యాయులు వ్యవహరించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖరెందర్ నాథ్ మాట్లాడుతూ స్వయం పాలన దినోత్సవం నిర్వహించడం ద్వారా విద్యా ర్థులు చైతన్యవంతులు అవుతారని అన్నారు. అలాగే 7వ తరగతి విద్యా ర్థులకు వీడ్కోలు పలకడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ధనుంజయ్, రాజేశ్వర్‌రెడ్డి, దుర్గయ్య, శాంతి, జయన్న, విద్యార్థులు పాల్గొన్నారు.



## బహిరంగ సభకు బయలుదేరిన భాజపా నాయకులు



**బాలానగర్,మార్చి 12 ప్రభాతవార్త:** బాలానగర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హైదరాబాద్ నగరంలోని ఎల్బీ స్టేడియంలో నిర్వహిస్తున్న భారతీయ జనతా పార్టీ భారీ బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. మంగళవారం ఈ మేరకు బాలానగర్ బిజెవైఎం ఆధ్వర్యంలో యువకులు పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లినట్లు తెలిపారు. యువజన సంఘాల సభ్యులు, తుఫాన్ వాహనాల ద్వారా బయలుదేరి వెళ్లారు.కార్యక్రమంలో బిజెపి నాయకులు, బిజెపినియోజకవర్గ ఇంఛార్జిపూలమోని నర్సింలు, బిజెవైఎం మండల అధ్యక్షుడుకుమార్‌నాయక్, శ్రీశైలం, సామ్యానాయక్, శ్రీనివాస్‌నాయక్, పట్నంరాజ్ తదితర నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

## ఉరి వేసుకొని వ్యక్తి మృతి

**కల్వకుర్తి, మార్చి 12 ప్రభాతవార్త:** చారకొండ మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామంలో వ్యక్తి ఉరి వేసుకొని మృతి చెందినసంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ఎర్రవల్లి గ్రామానికి చెందిన అల్వాల సలేశ్వరం (40) మంగళవారం ఉదయం 8 గంటలకు ఎర్రవల్లి వాగులో తన వెంట తెచ్చుకున్న చున్నీ సహాయంతో చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతుడికి భార్య, కుతూరు, కుమారుడు ఉన్నారు. మృతుడు అప్పుల బాధలు భరించలేక మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందిన సలేశ్వరం

## పది విద్యార్థుల హాల్ టికెట్ల అందజేత



**పానగల్,మార్చి 12,ప్రభాతవార్త:** త్వరలో ప్రారంభం కానున్న పదవ తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల పరీక్షల నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు హాల్ టికెట్లను ఎంఈఓ లక్ష్మణ్ నాయక్ ఎంపీడీవో కోటేశ్వర్‌లు పంపిణీ చేశారు.మంగళవారం మండల కేంద్రంలోని మండల రిసోర్స్ సెంటర్‌లో పదో తరగత విద్యార్థుల హాల్ టికెట్లను వారి చేతుల మీదుగా మండలంలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు.ఈకార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీరాములు, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు,సిఆర్పీలు గోవింద్, ఎంఐఎస్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం



**రేవల్లి,మార్చి 12,ప్రభాతవార్త:** రేవల్లి మండల కేంద్రంలో సోమవారం మృతి చెందిన కుటుంబానికి ఎమ్మెల్యే మేఘా రెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. సోమవారం శానాయిపల్లి గ్రామానికి చెందిన శాతర్ల లక్ష్మీదేవి మృతి చెందాడు. మంగళవారం రేవల్లి గ్రామానికి చెందిన కురువ కరయ్య చనిపోయాడు.ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేఘా రెడ్డి వారికి ఒక్కొక్క కుటుంబాలకు 5000 రూపాయలను ఆర్థిక సహాయం అందజేశారు.రెండు మండలాల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సత్య శిలారెడ్డి,మృతుల కుటుంబాలకు వారి అనుచరుల ద్వారా బాధిత కుటుంబానికి కుటుంబాలకు రూ.5 వేల చొప్పున అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వారాల పర్వతాలు, సురేష్,బాలయ్య,దేవయ్య,సుధాకర్,కాజా దాది పర్వతాలు,శీను ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు అలంపూర్‌కు పోతుగంటి భరత్ రాక

**అలంపూర్ మార్చి 12 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ బిజెపి పార్లమెంటు అభ్యర్థి పోతుగంటి భరత్ బుధవారం అలంపూర్‌కు రానున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు రామచంద్రారెడ్డి తెలిపారు. బిజెపి అధిష్టానం నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత మొట్టమొదటిసారిగా జిల్లాకు రానున్నట్లు తెలిపారు.ఆయనతో పాటు పార్లమెంటు సభ్యులు పోతుగంటి రాము లు, బిజెపి జాతీయ ఉపాధ్యక్షులు డీకే అరుణ, జాతీయ బీసీ కమిషన్ సభ్యులు టి.ఆచారి వస్తున్నట్లు తెలిపారు. ముందుగా ఉదయం 9 గంటలకు జోగులాంబఅమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొ నను న్నారు. ఆ తర్వాత స్థానిక హరిత టూరిజం హోటల్‌లో బిజెపి ముఖ్య కార్యకర్తల పరిచయం కార్యక్రమంలో పాల్గొననున్నారు. అనంతరం గద్వాలకి వెళ్లనున్నట్లు తెలిపారు.కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.



# పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

**ఉప్పునుంతల,మార్చి12 ప్రభాతవార్త:** కష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధిస్తామని వ్యక్తిత్వ వికాస నిపుణులు పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్ మెంట్ డిప్యూటి తహసిల్దార్ మాచన రఘునందన్ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జటప్రోలు శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి వ్యక్తిత్వ వికాస నిపుణులు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటి తహసిల్దార్ మాచన రఘునందన్ ఆత్మీయ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18 నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాలో ఉప్పునుంతల ఉన్నత పాఠశాల పేరు నిలపాలని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివి తల్లిదండ్రులతో పాటు పాఠశాలకు పేరు తీసుకురావాలని, భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే గురువులను గౌరవించాలని, వారి మార్గ నిర్దేశంలో సాగితే ఖచ్చితంగా విజయతీరాలను చేరుతామని పలు సూచనలు చేశారు. పాఠశాల విద్య ముగించుకొని ఉన్నత చదువులకు పరీక్షలు రాయబోతున్న వారందరికీ శుభాభినందనలు తెలిపారు. మాచన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు క్రమశిక్షణతో, సమయాన్ననుసరించి ప్రత్యేక శ్రద్ధతో చదివి, 10 జీపిఏ సాధించాలని, ప్రణాళికతో కష్టపడి చదివితేఉత్తమ ఫలితాలుసాధ్యమని అన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు హన్మంత్‌రెడ్డి, లక్ష్మారావు, శ్రీనివాసమూర్తి, అనురాధ, అనసూయ, సత్యనారాయణ, పోకల సతీష్,చంద్రశేఖర్,కల్పన,శ్యాంసుందర్, అజ్మతుల్లా,కమలేకర్‌నాగేశ్వర్‌రావు,పర్వతాలు,అజీమ్,అనిత, శ్రీలత పాల్గొన్నారు.



వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ రఘునందన్

# ప్రజల్లో ఎన్నికల పట్ల ఆత్మవిశ్వాసం కలగాలి

**కొత్తకోట మార్చి 12 ప్రభాతవార్త:** ప్రజల్లో ఎన్నికల పట్ల ఆత్మవిశ్వాసం కలగాలని సిఐ రాంబాబు, ఎస్సై మంజునాథ్ రెడ్డి అన్నారు. మంగళవారం కొత్తకోట పుర విధుల్లో కేంద్ర సాయుధ బలగాలచే ఇండో టిబెటిన్ బోర్డర్ పోలీస్ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ రక్షిత కె.మూర్తి ఆదేశానుసారం పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా, ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా వారిలో నమ్మకం, బరోసా, భద్రత కలిగేలా జిల్లా పోలీసులు, ఐటిబిపి కేంద్ర సాయుధ బలగాలచే ఫ్లాగ్ మార్చ్ కవాతు నిర్వహించామని తెలిపారు. కేంద్ర సాయుధ బలగాలచే ఫ్లాగ్ మార్చ్ కవాతును ప్రభుత్వ పాఠశాల నుండి ప్రారంభమై కోట్ల ఆంజనేయ దేవాలయం, చర్చి కాలనీ, జామే మజీద్, చౌరస్తా, కర్నూల్ రోడ్డు లోని దండు గడ్డ కాలనీ వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఓటర్లలో ఎలాంటి భయాందోళనకు తావు లేకుండా చేయడంలో భాగంగా జిల్లా పోలీసులు, కేంద్ర సాయుధ, బలగాలు ఫ్లాగ్ మార్చ్ ద్వారా ప్రజలందరికి ఎన్నికల పట్ల భద్రత, బరోసా కల్పించడానికి ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యే దృష్టి సారించి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరుగుతుందని, పార్లమెంట్ ఎన్నికలలో ఎక్కడ ఎలాంటి అవాంచనీయ సంఘటన జరగకుండా ప్రశాంత వాతావరణంలో విధులు నిర్వర్తిస్తాయని తెలిపారు. బందోబస్తు మాత్రమే కాకుండా డబ్బు, మద్యం,ఇతర విలువైన వస్తువులు అక్రమ రవాణా అరికట్టేందుకు చెక్ పోస్టులలో పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కేంద్ర సాయుధ బలగాల అసిస్టెంట్ కమాండెంట్ శ్రీరాము మండల్, పోలీసులు కేంద్ర సాయుధ, బలగాలు పాల్గొన్నారు.



కొత్తకోటలో పోలీస్ ఫ్లాగ్ మార్చ్ ర్యాలీ నిర్వహిస్తున్న సాయుధ బలగాలు

# కొనసాగుతున్న కుష్టు వ్యాధిగ్రస్థుల గుర్తింపు సర్వే

**పానగల్,మార్చి 12,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాను సారం కుష్టు వ్యాధి రోగస్తులు గుర్తింపు సర్వే సోమవారం ప్రారంభం కాగా ఈ నెల 24వ తేదీ వరకు కొనసాగుతుందని కమ్యూనిటీ హెల్త్ అధికారి రామయ్య తెలిపారు.మంగళవారం మండలంలోని పలు గ్రామాలలో కుష్టు వ్యాధి రోగులలో గుర్తించే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాలకు చెందిన ఆశ కార్యకర్త గ్రామంలోని ప్రతి ఇల్లును సందర్శించి కుష్టి వ్యాధి గుర్తింపు కార్యక్రమం చేపట్టాలన్నారు.ముఖ్యంగా ఈవ్యాధి మైకో బాక్టీరియం లేప్రే అనే వ్యాధికారక క్రిమి ద్వారా ఈ వ్యాధి సంభవిస్తుందని,కుష్టు వ్యాధి గ్రస్తులు మచ్చలు సహజ చర్మం రంగు కంటే తక్కువ లేదా ఎరువు లేదా రాగి రంగు కలిగి ఉంటాయి మచ్చపై స్పర్శ,నొప్పి ఉండదన్నారు.ఈ వ్యాధి శరీరంలో ఏ ప్రదేశంలో నైనా రావచ్చునని మచ్చలపైన వెంట్రుకలు రాలిపోయి,కుష్టు వ్యాధి ముఖ్యంగా చర్మానికి నరాలకు సోకుతుందన్నారు.కుష్టు వ్యాధి చాలా నెమ్మదిగా పెరిగే వ్యాధి అని లక్షణాలు బహిర్గతం కావడానికి సగటున మూడు సంవత్సరాలు పడుతుందన్నారు.కుష్టు వ్యాధి ఎవరికైనా రావచ్చని,దీనికి వయసు,లింగ బేధం ఉండదన్నారు. ఇది వంశపారపర్యం, శాపము,పాపము అంతకన్న కాదున్నారు.ఈ వ్యాధి ఎండీటి (బహుళ ఔషధ) చికిత్స,ఆరు నెలలు నుండి 12 నెలలు వాడితే వ్యాధి పూర్తిగా నయమవుతుంది,వ్యాధిగ్రస్తులు పూర్తి సామాజిక జీవితం గడపవచ్చు,ప్రారంభం దశలో గుర్తించి ఎండిటి చికిత్స ఇచ్చినచో కుష్టు వ్యాధి అంగవైకల్యానికి దారి తీయదున్నారు.చికిత్స పూర్తి అయిన వారు అంగవైకల్యం ఉంటే శస్త్ర చికిత్స ద్వార నయం చేసుకోవచ్చన్నారు.ఆయన వెంట హెల్త్ అసిస్టెంట్ రాంచందర్ వైద్య సిబ్బంది,ఆశ కార్యకర్తలు ఉన్నారు.




## 26 రోజులకు చేరిన దీక్ష



**రేవల్లి,మార్చి 12,ప్రభాతవార్త:** రేవల్లి మండల పరిధిలోని బండరావిపాకుల గ్రామం ఏదుల వీరాంజనేయ ప్రాజెక్టులో బండరాయిపాకుల, కొంకలపల్లి 2015 లో ముంపునకు గురయింది.కొందరికి పునరావాసం డబ్బులు రాలేదు.ముగ్గరికి సంవత్సరాలు గడుస్తున్నా పరిహారం అందలేదు.26 రోజుల నుంచి దీక్ష చేస్తున్న అధికారుల నుండి ఎలాంటి సమాచారం లేదని అధికారుల తీరుకు నిరసనగా బాధితులు దీక్ష 26 రోజుకు చేరింది.స్పందించడం లేదని వ్యక్తం చేస్తున్నారు.దీక్ష చేస్తూ వారి నిరసనను తెలియజేశారు.మంది నెలల గడుస్తున్నా మాకు పునరావాసం డబ్బులు మరియు కొత్త గ్రామంలో ఇండ్ల స్థలాలు ఇవ్వడంలేదని పాత గ్రామంలో దొంగల బెడద ఉందని మాకు భద్రత కల్పించాలని వారు కోరారు.అధికారులు స్పందించే వరకు దీక్ష విరమించనని అవసరమైతే దేనికైనా ముందుకు పోతానని సు కుమార్ రెడ్డి అన్నారు.అధికారులు ఈ సమస్యలను పరిష్కరించాలని తెలిపారు.

## కుష్టువ్యాధిగ్రస్థుల గుర్తింపు ఉద్యమం



వ్యాధి గ్రస్తులను గుర్తిస్తున్న డాక్టర్ సిద్దప్ప

**గద్వాల ప్రతినిధి మార్చి12 ప్రభాతవార్త:** కుష్టువ్యాధి గ్రస్తుల గుర్తింపు ఉద్యమం ప్రారంభించామని జిల్లా ఉపవైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.ఎస్కే సిద్ధప్ప తెలిపారు. సుంకులమ్మ మెట్టు గద్వాల ప్రాంతంలో కుష్టు వ్యాధి గ్రస్తులు గుర్తింపు ఉద్యమం కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11నుండి24 వరకు జోగులాంబ గద్వాల జిల్లాలో ఆశాకార్యకర్తలు ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటి సర్వే ద్వారా అనుమానిత కుష్టు వ్యాధి గ్రస్తులను గుర్తించి, దగ్గర్లోని ప్రభుత్వా సుపత్రికి రెఫర్ చేస్తారని తెలిపారు. వైద్య సిబ్బంది ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి 9 గంటల మధ్య ఇంటింటి సర్వే ద్వారా ఈ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు.ఈ సర్వేలో ఎవరికైనా స్పర్శ లేని ఎర్రని రాగి లేదా గోధుమ రంగు గల మచ్చ లు కలిగి ఉండడము అదే విధంగా కాళ్ల చేతులలో తిమ్మిర్లు రావడం చెమట రాకపోవడం వంటి లక్షణాలు ఉన్నట్లయితే వారిని దగ్గరలోని ప్రభుత్వా సుపత్రికి రెఫర్ చేస్తారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు అనుమానిత కుష్టి వ్యాధిగ్రస్తులను పరీక్షించి ఒకవేళ కుష్టు వ్యాధి అని నిర్ధారణ అయితే వెంటనే ఉచితంగా కుష్టువ్యాధికి సంబంధించిన మందులు ఇచ్చి చికిత్సలు నిర్వహిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో డా.రాజు, మల్లికార్జున్, డీపీఎంఓ లక్ష్మీదేవి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### విజయ సంకల్ప సభకు తరలిన బీజేపీ నాయకులు

**వెల్దండ, మార్చి 12 ప్రభాతవార్త:** బీజేపీ ప్రభుత్వ స్థాపనే లక్ష్యంగా బూత్ అధ్యక్షుల శక్తీ కేంద్రాల ఇన్‌చార్జిల విజయ సంకల్ప సభకు విచ్చేస్తున్న అమిత్‌షా సభకు మండల కేంద్రం నుంచి బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు కుర్మిద్ద యాదగిరి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బస్సుల్లో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి యెన్నం శేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు జంగయ్యయాదవ్, చక్రవర్తిగౌడ్, విష్ణుగౌడ్, మోహన్‌రెడ్డి, రవికుమార్, గోపాల్, శశిధర్‌రెడ్డి, రాంరెడ్డి తదితరులు తరలివెళ్లారు.

## నష్టపరిహారం ఇవ్వాలని రైతుల ధర్నా



కాంట్రాక్టర్ ఎంప్లాయిస్‌తో రైతులు వాగ్వాదం చేస్తున్న దృశ్యం

**అయిజ మార్చి 12 ప్రభాతవార్త:** మండల పరిధిలోని దేవబండ గ్రామంలో భరత్ మాలా రోడ్డుపై భూములు కోల్పోయిన రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత్ మాల రోడ్డులో భూమి కోల్పోయిన మాకు ఎకరాకు నాలుగు లక్షల అరవై వేలు మాత్రమే ఇచ్చి రోడ్డు పనులు మొదలు పెట్టారని ఈ విషయంపై గతంలో నష్టపరిహారం పెంచాలని కలెక్టర్ ని కలవగా రెండో విడత నష్టపరిహారం అందిస్తామని హామి ఇచ్చిన ఇంతవరకు ఇవ్వలేదని ఆవేదన చెందారు. ఇప్పటవరకు ముగ్గురు కలెక్టర్లు, మారిన రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని దీంతో మనస్థాపం చెందిన రైతులు మంగళవారం రోడ్డుపై మట్టితోలుతున్నతిప్పర్లను ఆపి ధర్నా నిర్వహించారు. దీంతో కాంట్రాక్టర్ ఎంప్లాయిస్‌తో రైతులు వాగ్వాదనికి దిగారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు.

## సీసీ రోడ్డు మంజూరు చేయాలని వినతి



**వెల్దండ, మార్చి12 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కుప్పగండ్ల గ్రామానికి సీసీ రోడ్లు మంజూరు చేయాలని కోరుతూ హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నివాసంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపాల్‌రెడ్డి, తలసాని వెంకటరెడ్డిలు ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తానని, సీసీ రోడ్ల మంజూరుకు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో శివరాజ్ తదితరులు ఉన్నారు.

## జిల్లా కేంద్రంలో చేనేత సందడి



**వనపర్తి ప్రతినిధి,మార్చి 12, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని సంఘం ఫంక్షన్ హాల్‌లో అచల భారత హస్త కళా చేనేత వస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేయడంతో చేనేత వస్తువులు తక్కువ ధరలకు అందుబాటులో ఉండడంతో ప్రజలతో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా నిర్వాహకులు వరప్రసాద్ మాటాడుతూ చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రతి సంవత్సరం నిర్వహించడం జరుగుతుందని, చేనేత కార్మికులు నేసిన వస్తువులను ప్రజలకు అందుబాటులోకి పెట్టడం వల్ల చేనేత రంగానికి సైతం ఉపాధి దొరుకుతుందని, జిల్లా కేంద్రం ప్రజల కోసం ఏప్రిల్ 7వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు.

## నాగనూల్‌లో రెడ్ క్రాస్ సంచార వైద్య సేవలు



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 12 ప్రభాతవార్త:** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నాగర్‌కర్నూల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పెద్ద ముద్దునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నాగనూల్ గ్రామంలో సంచార వైద్య సేవలను అందించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సెక్రటరీ రమేష్‌రెడ్డి హజరై మాట్లాడుతూ నాగనూల్ గ్రామంలోని వృద్ధులకు వైద్య శిబిరం నిర్వహించి 60 ఏళ్లకు పైబడిన 78 మంది వృద్ధులకు వైద్య సేవలు అందించడం జరిగిందని, ఇద్దరు మధుమేహం వ్యాధితో బాధపడుతున్నట్లు నిర్ధారించి ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేశారు. క్యాంప్‌లో జిల్లా యూత్ రెడ్ క్రాస్ జిల్లా కన్వీనర్ డి.కుమార్, పర్యవేక్షణాధికారి కేశవులు, ఎఎన్ఎం కవిత, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యేకు పంచాయతీ కార్మికుల వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 12 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీల్లో 60 వేల మంది గ్రామ పంచాయతీ కార్మికులు పనిచేస్తున్నారని, గ్రామాల్లో పారిశుధ్య కార్మికుల పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే మంజూరు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వర్ధన్ పర్వతాలు పేర్కొన్నారు. పాత కలెక్టర్ కార్యాలయం నుంచి పంచాయతీ కార్మికులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వరకు సీఐటీయూ నాయకులతో ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికుల్లో అత్యధికులు బలహీన వర్గాలకు చెందిన పేద కార్మికులు పనిచేస్తున్నారని, అలాంటి కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా 32 జిల్లాల్లో ఉన్నారని, గత 7 నెలల నుంచి జీతాలు అందడం లేదన్నారు. స్పందించిన ఎమ్మెల్యే సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాన్నారు.కార్యక్రమంలో నాయకులు పోదీల రామయ్య, కొంపల్లి అశోక్,బత్తుల వెంకటేశ్వర్లు, రామకృష్ణ, బాలరాజు, స్వామి, రామకృష్ణ, శ్రీశైలం, రామలింగస్వామి, రాములు, ముత్యాలమ్మ, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం



**వనపర్తి టౌన్ మార్చి 12 ప్రభాతవార్త:** క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం అందజేసిన బుడగ జంగంల వనపర్తి జిల్లా యువ నాయకులు, సిరువాటి మురళి, విభూతి చంద్రయ్య, సిరువాటి కృష్ణయ్య, అశ్వ వెంకటేశ్, సిరువాటి శంకర్ వీళ్ల ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కొత్తకోట మండలం ముమ్మలపల్లి ఎడవల్లి సరోజ భర్త మన్యం సరోజకు క్యాన్సర్ అనే వ్యాధితో బాధపడుతుంది. సరోజ భర్త మన్యం ఈ దంపతులకు ముగ్గురు పిల్లలు ఇద్దరమ్మాయిలు ఒక కుమారుడు అయితే వీరు నిరు పేద కుటుంబం కుటుంబ ఆర్థిక పరిస్థితి కూడా చాలా ఇబ్బందికరంగా ఉంది. ఈ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన వనపర్తి బేడ బుడగ జంగం యువ నాయకులు 5000 రూపాయలు 25 కేజీల బియ్యం ప్యాకెట్ 2 కేజీల కందిపప్పు, 5 లీటర్ల నూనె 21 మంది దాతలు సహకారంతో సహయం చేయడం జరిగిందని వారు తెలిపారు.

## గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి డాక్టర్ నరెందర్

**ఉప్పునుంతల,మార్చి12 ప్రభాతవార్త:** పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈనెల మార్చి 1 నుంచి మండలంలో ప్రారంభమైన గాలికుంటు వ్యాధి నివారణ ఉచిత టీకాల కార్యక్రమం కొనసాగుతుంది. మంగళవారం మండల పరిధిలోని సదగోడు, తిరుమాపూర్ గ్రామాలలో 301 పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేసినట్లు మండల పశువైద్యాధికారి డా. నరెందర్ తెలిపారు. ఈనెల 30 వరకు టీకాల కార్యక్రమం కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని ఆయా గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బాల కోటి, కమల, వెంకటేశ్వర్లు, చెన్నయ్య పాల్గొన్నారు.

**నేడు కొరటికల్‌లో:** నేడు బుధవారం మండలంలోని కొరటికల్లు గ్రామంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారి డా. నరెందర్ తెలిపారు. ఈ శిబిరానికి పాడి రైతులు సకాలంలో వచ్చి పశువులకు టీకాలు వేయించాలని పశు వైద్యాధికారి డా.నరెందర్ తెలిపారు.

## గ్రామాన్ని సందర్శించిన ప్రత్యేక అధికారులు

**పానగల్,మార్చి12, ప్రభాతవార్త:** గ్రామాల్లో త్రాగునీటి ఎద్దడి ఏర్పడుతుండడంతో గ్రామాలకు సంబంధించిన ప్రత్యేక అధికారితో పాటు సంబంధిత శాఖ అధికారితో కలిసి గ్రామాలను సందర్శించారు. మంగళవారం మండలంలోని తెల్ల రాళ్లపల్లి తాండ గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి విద్యాసాగర్ రెడ్డి మిషన్ భగీరథ ఏ.ఇ లక్ష్మీ గ్రామపంచాయతీ కార్యదర్శితో కలిసి గ్రామంలో త్రాగునీటి ఎద్దడిని నివారించేందుకు గ్రామ నాయకులతో చర్చించి గ్రామంలో పర్యటించారు.ఇటీవల నిర్మించిన మినీ వాటర్ ట్యాంక్ ద్వారా నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు వారు తెలిపారు.గ్రామంలోని నీటి సమస్య లేకుండాచూడాలని నాయకులుప్రజలు అధికారులను కోరారు. అధికారులను కోరారు.వారి వెంట గ్రామానికి చెందిన నాయకులు బాల్య నాయక్ రాజు నాయక్,రవితేజ,తదితరులు ఉన్నారు.



## ముంపు గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే

**ముంపు గ్రామాలకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి వినతి**





సమావేశంలో మాట్లాడుతున్న మక్తల్ ఎమ్మెలే వాకిటి శ్రీహరి

**నారాయణపేట ప్రతినిధి, మార్చి 12 ప్రభాతవార్త:** మక్తల్ నియోజకవర్గం సంగంబండ ప్రాజెక్టు ముంపు గ్రామాలను మంగళవారం పర్యటించి అక్కడ ప్రజలు పడుతున్న బాధలను మక్తల్ ఎమ్మెలే వాకిటి శ్రీహరి అడిగి తెలుసు కున్నారు. నియోజకవర్గంలోని సంగంబండ ప్రాజెక్టు కింద మాగనూరు మండలంలోని నెరదుగొమ్ము, ఉజ్జయిలి, సంగంబండ గార్లపల్లి ప్రాంతాలు ముంపుకు గురికాగా మంగళవారం ఉజ్జల్లి, నేరడుగొమ్ము గ్రామాలలో పర్య టిస్తూ ప్రజల సాదక బాధకాలను తెలుసుకున్నారు. ప్రాజెక్టు కింద ముంపుకు గురైన తమ గ్రామస్తులు నిర్వాసిత గ్రామాలుగా ప్రకటించిన ఇప్పటివరకు భూములకు, ఇళ్లకు నష్టపరిహారం రాలేదని వర్షాకాలంలో ప్రాజెక్టుకు నీరు చేరడంతో ఉండేందుకు వీలు లేకుండా ఉంటుందని విషయాన్ని కెసిఆర్ దృష్టికి తీసుకువెళ్లినా అప్పుడు ఇప్పుడు అంటూ కాలయాపన చేశారని ఎమ్మె ల్యేకు వివరించారు. ప్రస్తుతం ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా తమను పట్టిం చుకొని ముంపు గ్రామాలకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి ముంపు బాధిత గ్రామస్తులు మొరపెట్టుకున్నారు. కార్యక్రమంలో బాల కృష్ణారెడ్డి, మాజీ జడ్పీటిసి లక్ష్మారెడ్డి, ఆనంద్‌గౌడ్, రాజప్పగౌడ్, గోపాల్‌రెడ్డి, మౌలాలి, నాగప్ప, శివరాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవికుమార్, నేరెడుగాం, ఉజ్జయిలి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిభావంతో భజన పోటీలు

**బిజినేపల్లి, మార్చి 12 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శ్రీ ఆనందగిరి గోదా సమేత లక్ష్మి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన భక్తి భజన పోటీలు ఆహుతులను భక్తి భావంలో ముంచెత్తాయి. ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా 10 భక్తి భజన బృందాలు పాల్గొనగా నవపేట మండలం గురుకుంట గ్రామానికి మొదటి బహుమతి దక్కింది. పాన్‌గల్ మండలం మందాపురం రెండో బహుమతి, మహబూబ్‌నగర్ రాజ రాజేశ్వరి భజన మండలి మూడో బహుమతి, పాన్‌గల్ రైన్‌పల్లి గ్రామానికినాలుగో స్థానంలో నవపేట్ మండలం కొండాపూర్ ఐదోస్థానం, గోదల్ ఆరోస్థానంలో నిలిచాయి. భక్తి భజన పోటీల్లో ఉత్తమ హార్మోనిస్టుగా గురుకుంట భజన మండలి రిటైర్డ్ పోలీస్ అధికారి నారాయణ, ఉత్తమ తబలిస్టుగాబలరాంపల్లి బిక్షపతికి బహుమతులు అందించారు. న్యాయ నిర్ణేతలుగా రుక్మాన్‌గాధరెడ్డి, పాండుస్వామిలు వ్యవహరించారు. అంతకు ముందు ప్రత్యేక పూజలు నిర్వహించి జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని దేవస్థానం అభివృద్ధికమిటి ఏడుదొడ్ల శ్రీనివాసరెడ్డి చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సనాతన సంప్రదాయంలో భజనలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని భజన బృందాలను ప్రోత్సహించడానికి భక్తి భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కురువ వెంకన్న నారాయణగౌడ్, రాములు, బాలకిషన్, రాజేందర్‌గౌడ్, హరినాథ్‌బాబు, నరేందర్, కావలిరంజాన్, చంద్రయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

## బేటి బచావో-బేటి పడావో కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న మహిళా ఎంపవర్మెంట్ అధికారి రేణుక

**కల్వకుర్తిటౌన్, మార్చి 12 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం బేటి బచావో బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా మహిళా ఎంపవర్మెంట్ అధికారి రేణుక మాట్లాడుతూ ఆడ పిల్లలను కాపాడుకునేందుకు వారిని చదివిద్దామని, ఆడపిల్లలు బాగా చదివితే ఆటల్లో విద్యాభివృద్ధి, సమాజ సేవ ఉంటుందని, మహిళా చదువు దేశ ఖ్యాతిని భవిష్యత్తు దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జమల్ హామీద్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



**వెల్దండ, మార్చి 12 ప్రభాతవార్త:** మండల పరిధిలోని రాచూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తమ తోటి విద్యార్థులకు పాఠాలుబోధించారు. ప్రధానోపాధ్యాయులుగా కే. రక్షిత్, ఎంఈఓగా వీ. కావ్య, డీఈఓగా జీ. వాసవి, ఉపాధ్యాయులుగా నిషితాచారి, ప్రమణిత, అక్షయ్, ధరణి, పర్మిళ, సుశాంత్, వైష్ణవి, శశాంక్‌తో పాటు మరో12 మంది ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ శంకర్‌నాయక్ హాజరై ప్రధానోపాధ్యాయులువెంకట్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విద్య ద్వారానే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని, చిన్నప్పటి నుంచే మనం వ్యవహరిస్తున్న లక్షణాలే రాబోవు రోజుల్లో మంచి పౌరుడిగా తీర్చిదిద్దడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థి ఉపాధ్యాయులకు బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలోజ్యోస్న, శ్రీలత, శ్రీనివాస్‌రావు, నారాయణరావు తదితరులు ఉన్నారు.

### అనన్యశ్రీని అభినందించిన ఉప కులపతి లక్ష్మీకాంత్ రాథోడ్



**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి12 ప్రభాతవార్త:** ఎంజి యూనివర్సిటీ కొట్టాయం కేరళకు ప్రాతినిధ్యం వహించిన మక్తల్‌కు చెందిన ప్రముఖ వాలీబాల్ క్రీడాకారిణి పి. అనన్యశ్రీ పాలమూరు విశ్వ విద్యాలయాన్ని సందర్శించి వైస్ ఛాన్స్‌లర్ ప్రొ॥ ఎల్‌బి లక్ష్మీకాంత్ రాథోడ్‌ను మర్యా దపూర్వకంగా కలిశారు. ఆమె చైనాలోని చెంగ్డులో జరిగిన వరల్డ్ యూని వర్సిటీ గేమ్స్, గుహతి అస్సాంలో జరిగిన ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్ (సిల్వర్ మెడల్), కెఐఐటి యూనివర్సిటీ భువనేశ్వర్‌లో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ గేమ్స్ (గోల్డ్ మెడల్)కు ప్రాతినిధ్యం వహించారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి రిజిస్ట్రార్ డా. మధుసూదన్‌రెడ్డి ఆమె తల్లిదండ్రులు వరలక్ష్మి ఆనంద్‌లు పాల్గొన్నారు.

## పదోన్నతులు చేపట్టండి: టీపీఆర్‌టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 12, ప్రభాతవార్త ః** తెలంగాణ హైకోర్టులో మల్టీజోన్ -2లో ఉపాధ్యాయుల పదోన్నతులపై స్టే ను తొలగించినందుకు వెంటనే పదోన్నతులు చేపట్టాలని టీపీఆర్‌టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్ర వెంకటేశం గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పార్లమెంటర్ ఎన్నికల కోడ్‌కు ముందే ఈ ప్రక్రియ పూరినత చేయాలని ప్రమోషన్ల ప్రక్రియ వేగవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్నికల కోడ్ వస్తే మే వరకు పదవి విరమణ పొందే ఉపాధ్యాయులు నష్టపోతారని కావునా పదోన్నతులు సాధ్యమైనంత త్వరగా చేపట్టాలని కోరారు.

# రెండేళ్లైన ముందుకు సాగని జర్నలిస్టుల ఇండ్ల నిర్మాణం!

- ప్రచారం ఘనం.. పనులేమో శూన్యం
- డబుల్ బెడ్‌రూం నిర్మాణంలో అవకతవకలు?
- ఇదేంటని ప్రశ్నిస్తే జర్నలిస్టులపైనే దాడులు, బెదిరింపులు
- న్యాయం కోసం జిల్లా ఎస్పీని కలిసిన బాధిత జర్నలిస్టులు

**చిన్నంబావి, మార్చి 12 ప్రభాతవార్త:** గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం చిన్నంబావి మండల కేంద్రంలో మూడుఅడుగులు ముందుకు, ఆరడుగులు వెనక్కి అన్న చందంగా ఉంది. చిన్నంబావి మండల కేంద్రంలో ఉమ్మడి వీపనగండ్ల మండలంలోని ఇరవై మంది జర్నలిసుట్లకు గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు20 మందికి నాటి ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి మంజూరు చేయించారు. ఇండ్ల నిర్మాణానికి 2022 జూన్4 రాత్రి9గం. లకుప్రారంభోత్సవం చేశారు. నాటి నుంచి నేటికి సుమారు రెండేళ్లు పూర్తవుతున్న నేటికీ బేస్మెంట్, పిల్లర్ల నిర్మాణాలతో పనులు నిలిపివేసి సదరు కాంట్రాక్టర్ చోద్యం చూస్తున్నాడు. అధికార బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఏవన్ కాంట్రాక్టర్ తిరుపతయ్యసాగర్ కాంట్రాక్టు అగ్రిమెంట్ చేసుకుని ప్రస్తుతం ప్రభుత్వం దగ్గర బడ్జెట్ లేదని ఒక్కొక్క జర్నలిస్టు ఆరు లక్షలు మొత్తం చెల్లిస్తే పను లు చేపడతామని



కాంట్రాక్టర్‌పై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన దృశ్యం



రెండేళ్ల క్రితం జర్నలిస్టు కాలనీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం (ఫైల్)

తెలియజేయడంతో ఇండ్లు మంజూరైన 20 మంది జర్న లిస్టులు నానా తంటాలు పడిబంగారు ఆభరణాలు, భూములు తదితర వస్తువులు కుదువపెట్టి డబ్బులు తెచ్చి సుమారు1 కోటి రూపాయలు ఇవ్వడం జరిగింది. నిర్మాణాలు ఇప్పుడు అప్పుడు అంటూ సాగదీస్తూ రెండేళ్లు గడుస్తున్నా ముందుకు సాగడం లేదు. గత కొంతకాలంగా పలు సార్లు సదరు కాంట్రాక్టర్లను కలవడానికి ప్రయత్నించగా ఎక్కడ తాను కలవకపోగా, రెండు పడకల గదుల పథకంలో కాంట్రాక్టర్ భారీ మోసానికి పాల్పడుతున్నారని సుమారు1 కోటి రూపాయలతో ఉడాయించాడని మండల జర్నలిస్టులు మంగళవారం వనపర్తి జిల్లా ఎస్పీ రక్షితమూర్తికి కాంట్రాక్టర్ తిరుపతయ్య సాగర్‌పై ఫిర్యాదు చేశారు. రెండేళ్ల క్రితం రాజకీయ నాయకుల ప్రోద్బలంతో జర్నలిస్టుల కాలనీ నిర్మాణం కోసం అవకాశం దక్కించుకున్నారు. అదే సమయంలో 20 మంది జర్నలిస్టులు తమ నూతన ఇళ్లను అధునాతన సౌకర్యాలతో నిర్మించుకోవడానికి అదనంగా ఒక్కొక్కరురూ.6 లక్షలు చెల్లించే విధానంగా కాంట్రాక్టర్‌తో ఒప్పందం చేసుకున్నారు. ఆ ఒప్పందంలో భాగంగా ఒక్కొక్కరుగా రూ.5 లక్షలు చెల్లించగా సదరు



ఇండ్ల నిర్మాణం నిలిచిపోయిన జర్నలిస్టు కాలనీ

కాంట్రాక్టర్ నామికే వస్తుగా పనులు మొదలు చేసి టెండర్ పనులు ఇంకా పూర్తి కాలేదని కాలయాపన చేస్తూ నేటికీ కూడా పనులు మొదలుపెట్టడం లేదు. ఇదే విషయంపైపలుమార్లు జర్నలిస్టులు కాంట్రాక్టర్‌ను సంప్రదించగా ప్రభుత్వం మారింది పనులు చేయడానికి సాధ్యం కాదని దాటవేస్తూ కాలయాపన చేయడంతో పాటుగా మీ జర్న లిస్టులు ఇచ్చిన డబ్బులు పూర్తి స్థాయిలో నా దగ్గరకు రాలేదని ఈ ఒప్పంద వ్యవహారంలో ఉన్న కొందరు సీనియర్‌జర్నలిస్టుల దగ్గరనే డబ్బులు ఉన్నాయని కొత్త నాటకాలకు తెరతీస్తూ జర్నలిస్టుల మధ్య వివాదాలు సృష్టించారు. అలాగే కొందరు జర్నలిస్టుల పట్ల కాంట్రాక్టర్ దురుసుగా ప్రవర్తిస్తున్నారని జర్నలిస్టు సోదరులు ఎస్పీతో మొరపెట్టుకున్నారు. సదరు కాంట్రాక్టర్ తిరుపతయ్య సాగర్ మొత్తం రూ.2 కోట్ల28 లక్షల భారీ మోసానికి పాల్పడే ప్రయత్నం చేయగావారికి సహకరించిన కొందరు సీనియర్ జర్నలిస్టులపై కూడా తగిన చర్యలు తీసుకోవాలనిజిల్లా ఎస్పీకి మోసపోయిన సదరు జర్నలిస్టులు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆమె త్వరలోనే విచారణ చేపట్టి న్యాయం చేస్తామని తెలిపారు.

## మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

### అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్

**గద్వాల ప్రతినిధి మార్చి 12 ప్రభాతవార్త:** మహిళలు అన్ని రంగాలలో అంకితభావంతో పనిచేస్తారని, వారికి సముచిత స్థానం కల్పించడంలో ముందుంటామని జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్ అన్నారు. మంగళవారం ఐడిఓసి సమావేశం హాల్ నందు మహిళా, శిశు, అభివృద్ధి దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో జిల్లా అదనపు కలెక్టర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం 2024 యొక్క ప్రధాన థీమ్ మహిళల స్వయం ఉపాధికి పెట్టుబడి పెట్టండి వారి అభివృద్ధిని వేగవంతం చేద్దాం. ఈ థీమ్ ఆధారంగా కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. అన్ని రంగాల్లో పురుషులకంటే మహిళలు ముఖ్యపాత్ర పోషిస్తున్నానన్నారు. మహిళా నిపుణులు వివిధ రంగాలలో తమ ప్రతిభను చాటి సమాజానికి మేలు చేయాలన్నారు. ఎన్నికల సమయంలోను మహిళలు ఎంతో చక్కగా పనిచేశారని అన్నారు. అనంతరం మహిళా అధికారులు ఐడిఓసి ఆవరణలో బెలున్స్ ఎగురవేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్ర



మాలు ఆకట్టుకున్నాయి. వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న అధికారిణిలకు మెమెంటోలు అందజేయడం జరిగింది. జిల్లాలోని కళాశాలల విద్యార్థినిలకు అనీమియా పరీక్షలను ఐడిఓసి నందు బాలికలకు అనేమియా పరీక్షలు నిర్వహించడంజరిగింది. ఈ కార్యక్రమంలో జెడ్పిసిఈఓ కాంతమ్మ, ఎంప్లాయిమెంట్ అధికారిప్రియాంక, డీడబ్ల్యూఓ ఇంచార్జి సుధారాణి, వెనుకబడిన జిల్లా సంక్షేమఅధికారి సరోజ, ఆర్అండ్‌బి ప్రగతి, మత్స్య శాఖ అధికార షకీలా భాను, మహిళా అధికారిణిలు, మహిళలు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

- గద్వాల జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్

**గద్వాల ప్రతినిధి మార్చి12 ప్రభాతవార్త:** వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. మంగళవారం గద్వాల్ పరిధిలోని గోనుపాడు గ్రామంలో మిషన్ భగీరథ త్రాగునీరు సరఫరాను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలగకుండా వేసవిలో త్రాగునీటి పై ప్రత్యేక దృష్టి సారించాలని, మిషన్ భగీరథ ద్వారా త్రాగునీరు సరఫరా చేయాలన్నారు. నీరు వృధా కాకుండా చూడాలని, ప్రతిరోజు క్లోరినేషన్ చేయాలని సూచించారు. లీకేజీలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా త్రాగునీరు, బల్క్‌వాటర్ సౌలభ్యత, నీటి సరఫరాపై మిషన్ భగీరథ అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయితీ కార్యాలయంలో నీటి సరఫరాకు సంబంధించిన ఏడు రిజిష్టర్లను, క్లోరోస్కోప్ ద్వారా నీటి



గోనుపాడులో మిషన్ భగీరథ నీటి సరఫర గురించి తెలుసుకొంటున్న కలెక్టర్ సంతోష్

స్వచ్ఛతను పరిశీలించేవిధానాన్ని అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎస్ఈ జగన్మోహన్, ఈఈ శ్రీధర్‌రెడ్డి, డీఈలు, ఏఈలు, ఎంపిడిఓ ఉమాదేవి, గ్రామప్రత్యేక అధికారి శివకుమార్, ఎంపిఓ చెన్నయ్య, గ్రామ కార్యదర్శి సాలేహ తదితరులు పాల్గొన్నారు.

## మద్యానికి యువత బానిస కాకూడదు




పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎస్సై రవినాయక్

**రాజాపూర్, మార్చి 12 ప్రభాతవార్త:** యువత మద్యానికి బానిసైతే జీవితం అంధకారం అవుతుందని యువత చెడు అలవాట్లకు బానిసవ్వకూడదని ఎస్సై రవినాయక్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన ఎస్సై రవినాయక్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో గోనయో బృందం ఆధ్వర్యంలో ఎస్సై రవినాయక్ యువత మేలుకో మద్యానికి బానిసైతే ఒకతరం వెనుకబడతావని ఒక్కక్షణం ఆలోచించు అనే పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మద్యానికి బానిసై జీవితాలను నాశనం చేసుకోకూడదని మంచి మార్గాలను ఎంచుకొని జీవితంలో ఉన్నతమైన స్థానానికి ఎదగాలని తల్లిదండ్రులకు కన్న ఊరికి మంచిపేరు తెచ్చే విధంగా యువత తయారవ్వాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై రవినాయక్‌తో పాటు గోనయో బృందం, బిజెపి జిల్లా నాయకులు వనపర్తి నర్సింలు, పల్లె శేఖర్, బాలవర్ధన్‌గౌడ్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పదంగా మహిళ మృతిపై కేసు నమోదు



లక్ష్మమ్మ (ఫైల్)

**రేవల్లి, మార్చి 12, ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా రేవల్లి మండల పరిధిలోని శానాయిపల్లి గ్రామానికి చెందిన సాతర్ల లక్ష్మమ్మ 50 అనే మహిళ అనుమానా స్పదంగా మృతి చెందిన సంఘటనపై ఎస్సై తిరుపతిరెడ్డి మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం సాతర్ల లక్ష్మమ్మ మతిస్థి మితం సరిగ్గా లేదు. శివరాత్రి సందర్భంగా ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో శానాయిపల్లి గట్టు వద్ద కథ వెళ్తున్నానని చెప్పి లక్ష్మమ్మ ఇంటి నుండి బయటకు వచ్చింది. కానీ తిరిగి ఇంటికి రాలేదు. సోమవారం శానాయిపల్లి రేవల్లి మధ్యలో గల కెనాల్ కాలువలో ఒక మహిళ మృతదేహం లభించిందని తెలుసుకున్న లక్ష్మమ్మ కుటుంబ సభ్యులు వెళ్లి చూసి మృతదేహం లభించిందని తెలుసుకున్న లక్ష్మమ్మ కుటుంబ సభ్యులు వెళ్లి చూసి మృతదేహం లక్ష్మమ్మదే అని నిర్ధారించారు. లక్ష్మమ్మను తన భర్త పెళ్లి చేసుకున్న రెండు సంవత్సరాలకే విడిచి పెట్టినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులకు సమాచారం అందజేయగా సిఐ నాగభూషణం, ఎస్సై తిరుపతిరెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం ఎస్సై తిరుపతి రెడ్డి లక్ష్మమ్మ మృతదేహాన్ని వనపర్తి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం కొరకై తరలించారు. మంగళవారం లక్ష్మమ్మ అల్లుడు సాతర్ల కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతిరెడ్డి తెలిపారు.

## పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

మొదటి పేజీ తరువాయి భాగం..

అధికారులతో వీడియో కాన్పరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రధాన అధికారి వివరిస్తూ కొత్త ఓటర్ల ఫారాలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. తుది ఓటరు జాబిత వెలువడిన తర్వాత 21 సంవత్సరాల పై బడిన వారు కొత్త ఓటర్లుగా నమోదు చేసుకుంటున్నారని ఈ విషయంలో చాలా జాగ్రత్తగా దరఖాస్తులు పరిశీలించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేయించాలని సూచించారు. వి. ఐ. పి. ఓటర్లను గుర్తించి ఓటరు జాబితాలో మార్కింగ్ చేయించాలని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించనున్న ఉద్యోగులు, సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ లు సక్రమంగా అందేవిధంగా వారి ఎపిక్ కార్డు వివరాలను ఆన్లైన్ లో నమోదుచేయించాలని సూచించారు. ఎన్నికల సిబ్బందికి పూర్తి స్థాయి శిక్షణ ఇవ్వాలని తెలియజేశారు. షెడ్యూల్ వెలువడిన రోజు నుండిఎన్నికల ప్రవర్తనా నియమావళి పకడ్బందీగా అమలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలి. సోషల్ మీడియాను నియంత్రించే విధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**స్వీప్ యాక్టివిటీ ద్వారా అవగాహన కల్పించాలి: జిల్లా కలెక్టర్**

ఏప్రిల్,1 నాటికి 18 సంవత్సరాల వయస్సు పూర్తి కానున్న యువత ఓటరు జాబితాల్లో పేర్లు నమోదు చేసుకోడానికి అవకాశం ఉన్నందున సద్వినియోగం చేసుకునే విధంగా స్వీప్ యాక్టివిటీ ద్వారా అవగాహన కల్పించాలని అధికారులను సూచించారు. అన్ని పోలింగ్ స్టేషన్లను స్వయంగా పరిశీలించి అన్ని మౌలిక సదుపాయాలు ఉండేవిధంగా చర్యలు తీసుకొని నివేదికను ఇవ్వాల్సిందిగా తహశీల్దార్లు ఆదేశించారు. ఎక్కడైనా ఆగ్జిలరి పోలింగ్ స్టేషన్ల ఆవశ్యకత ఉన్నదా అనే విషయాలను తహశీల్దార్ లతో వివరాలు సేకరించారు. ఓటరు జాబితాలో డూప్లికేట్ పేర్లు ఉంటే పరిశీలన అనంతరం తొలగించాలని సూచించారు. కొత్త ఓటర్ల ఎపిక్‌కార్డులను పోస్టు ద్వారా పంపేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ యం. నగేష్, ఆర్డిఓ పద్మావతి తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## వడ్డె ఓబన్న విగ్రహం ప్రతిష్టకై ఎమ్మెల్యేకి వినతి

**వనపర్తి టౌన్, మార్చి 12, ప్రభాతవార్త:** తెలంగాణ వడ్డెర సంఘం అండ్ చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అండ్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు కంచపు దేవరాజు ఆధ్వర్యంలో వడ్డెర సమస్యలపై అలాగే వనపర్తిలో వడ్డే ఓబన్న విగ్రహం ప్రతిష్టకై వనపర్తి నియోజకవర్గం శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఇప్పుడు ఎలక్షన్ కోడ్ ఉంది కాబట్టి ఎలక్షన్లు అయిన తర్వాత చర్చిద్దాం అని ఎమ్మెల్యే వివరించారు. ఇట్టి కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు పసుపుల స్వామి పట్టణ అధ్యక్షులు కుంచపు గోపాల్ నియోజకవర్గం ఉపాధ్యక్షులు రామచంద్రి మన్యం వెంకటయ్య ఆంజనేయులు మరియు వడ్డెర నాయకులు పాల్గొనడం జరిగింది.

## వరి ధాన్యం పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్
- పలు అంశాలపై కలెక్టర్ సమీక్ష..

**వనపర్తి ప్రతినిధి, మార్చి 12, ప్రభాతవార్త:** కేంద్ర ఆహార సంస్థకు ఇవ్వాల్సిన సి.యం.ఆర్ వరి ధాన్యం పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టర్ తన క్యాంప్ కార్యాలయంలో పౌర సరఫరాల శాఖ అధికారులు. సిబ్బందితో సి.యం.ఆర్ రైస్, గ్యాస్ సిలిండర్ల పంపిణీ, పెట్రోల్ బంక్‌లో నిర్వహణ తదితర అంశాల పై సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. వనపర్తి జిల్లా రైస్ మిల్లుల నుండి కేంద్ర ఆహార సంస్థకు ఇవ్వాల్సిన వరి ధాన్యం అప్పగించడం పై పూర్తి నివేదిక ఇవ్వాల్సిందిగా సివిల్ సప్లై అధికారిని ఆదేశించారు. రైస్ మిల్లులు ధాన్యం అప్పగింత పై ఇప్పటి వరకు తీసుకున్న చర్యలపై నివేదిక కోరారు. జిల్లాలో గ్యాస్ సిలిండర్ల సరఫరా, సమస్యల పై నివేదిక ఇవ్వాల్సిందిగా కోరారు. జిల్లాలోని పెట్రోల్ బంక్ లలో ఉన్న మౌలిక సదుపాయాలు ఇతరత్రా సమస్యలను పరిశీలించి నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. జిల్లా సివిల్‌సప్లై అధికారి శ్రీనాథ్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మూడు నామినేషన్లు తిరస్కరణ

- 13 మంది అభ్యర్థుల నామినేషన్‌లు ఆమోదం
- ఉప ఎన్నిక నామినేషన్లు పరిశీలన
- రేపటితో ఉప ఎన్నిక నామినేషన్ల పరిశీలన
- రేపటితో ఉపసంహరణకు గడువు

**మహబూబ్‌నగర్‌బ్యూరో, మార్చి 12 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి ఉప ఎన్నికకు అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయ భవనంలోని కలెక్టర్ ఛాంబర్‌లో ముగిసింది. 16 మంది అభ్యర్థులు 28 సెట్లు నామినేషన్ వేయగా రిటర్నింగ్ అధికారి, జిల్లా ఎన్నికల అధికారి జి. రవినాయక్ ఎన్నికల కమిషన్ నియమించిన పరిశీలకురాలు, అటవి, పర్యావరణ, శాస్త్ర, సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎ. వాణిప్రసాద్ అభ్యర్థుల సమక్షంలో నామినేషన్‌ల స్క్రూటినీ నిర్వహించారు. స్క్రూటినీలో 13మంది అభ్యర్థుల నామినేషన్ ఆమోదించగా, ముగ్గురు అభ్యర్థులనామినేషన్‌పత్రాలు తిరస్కరించడం జరిగింది.

**తిరస్కరణకు గురైన అభ్యర్థుల నామినేషన్...**

1. శ్రీకాంత్ పిళ్ళై (స్వతంత్ర) 2. జీవన్‌రెడ్డి (స్వతంత్ర)
3. లక్ష్మిరెడ్డి నాగరకుంట (బిఆర్ఎస్)

**ఆమోదించిన అభ్యర్థుల నామినేషన్లు...**

జాతీయ, రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులు

1. జీవన్‌రెడ్డి మన్నె (భారత జాతీయ కాంగ్రెస్), 2. నవీన్‌కుమార్ రెడ్డి (బిఆర్ఎస్)... **స్వతంత్ర అభ్యర్థులు:** 3. కొండా సుధాకర్‌రెడ్డి, 4. గడీల కుమార్‌గౌడ్, 5. గవినోల్ల బలరామ్‌రెడ్డి, 6. దేవి రవిందర్, 7. మహ్మద్ రహీమ్‌ఖాన్, 8. మున్నూరు రవి, 9. మూడవత్ శంకర్‌నాయక్, 10. మంగి విజయ్, 11. శరబ్బాయికృష్ణ, 12. సుదర్శన్‌గౌడ్, 13. వి. సుమలత నామినేషన్ల ఉపసంహరణకు ఈనెల 14 చివరి తేదీ, ఉపసంహరణ అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటించనున్నట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.

## బహుజనులైన దళితులను మోసం చేయడానికి ఇంత నాటకమా?

- బహుజన్ సమాజ్ పార్టీ మండల అధ్యక్షులు రాజమౌళి ముదిరాజ్

**కొత్తకోట, మార్చి12, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ బహుజనులైన దళితులను మోసం చేయడానికి ఇంత నాటకమా..? అని బహుజన్ సమాజ్ పార్టీ మండల అధ్యక్షులు రాజమౌళి ముదిరాజ్ ప్రశ్నించారు. మంగళవారంయాదాద్రి దేవాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కొండా సురేఖకు జరిగిన అవమానాన్ని ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం లేనప్పుడు అధికారంలోనికి రావడానికి కుర్చీ లేస్తారు అధికారం వచ్చినాక అధికారం ఇచ్చినట్టే చేసి అవమానిస్తారని మండిపడ్డారు. బిజెపి ప్రభుత్వం రామ్నాథ్ కోవింద్ విషయంలోనూ ప్రస్తుతరాష్ట్రపతి ద్రౌపది ముర్మ విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం నేటి ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కుని విషయములోనూ అదే వివక్ష అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా పార్టీల్లో ఉన్న దళిత సమాజం కన్నులుండి చూస్తలేవా చెవులు ఉండి వినటం లేదా నోరు ఉండి మాట్లాడడం లేదే దానికి చెంచా అంటార బానిసలు అంటార ఒక్కరన్నా ఖండించడం లేదే అని ఆవేదన వ్యక్తం చేశారు. బహుజన్ సమాజ్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని ఈ పాలకవర్గాలకు రాబోయే పార్లమెంట్, ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతుందని అన్నారు.

## విజయ సంకల్ప సభకు తరలిన బీజేపీ నాయకులు

**వెల్దండ, మార్చి 12 ప్రభాతవార్త:** బీజేపీ ప్రభుత్వ స్థాపనే లక్ష్యంగా బూత్ అధ్యక్షుల శక్తీ కేంద్రాల ఇన్‌చార్జిల విజయ సంకల్ప సభకు విచ్చేస్తున్న అమిత్‌షా సభకు మండల కేంద్రం నుంచి బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు కుర్మిద్ద యాదగిరి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బస్సుల్లో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి యెన్నం శేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు జంగయ్యయాదవ్, చక్రవర్తిగౌడ్, విష్ణుగౌడ్, మోహన్‌రెడ్డి, రవికుమార్, గోపాల్, శశిధర్‌రెడ్డి, రాంరెడ్డి తదితరులు తరలివెళ్లారు.

